ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 33.0
కనిష్ఠం 22.4

ANDHRAJYOTHY



యాదాద్రి భువనగిరి

బుధవారం 9 జూలై 2025

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	531.90 (171.8788)	1,14,146	4,590
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	641.65 (3.60)	68.78	68.78
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	153.738 (19.5)	నిల్	7,000

ప్రాజెక్టుల నీటిమట్టం

చికెన్ ధరలు: లైవ్ : రూ.125 | డ్రెస్ : రూ.190 | స్కిన్‌లెస్ : రూ.210



వానాకాలంలోనూ
మూసీపై రయ్ రయ్

- బొల్లెపల్లి-సంగెం వద్ద హైలెవల్ బ్రిడ్జి
- రూ.45కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం
- త్వరలో టెండర్ల ప్రక్రియ
- భువనగిరి, బీబీనగర్,వలిగొండ మండలాలకు రాకపోకలు సులువు
- సీఎం చొరవతో భీమలింగం దర్శనానికి అడుగులు

వానాకాలంలో హైదరాబాద్ నగరంతోపాటు జిల్లాలో భారీ వర్షాలు కురిస్తే మూసీ ఉధృతంగా ప్రవహిస్తుంది. ఎగువ నుంచి వచ్చే నీటితో మూసీ కాల్వలు పరవళ్లు తొక్కుతుంటాయి. దీంతో జిల్లాలోని పలు గ్రామాలకు రాకపోకలు నిలుస్తుంటాయి. ఈ నేపథ్యంలో ప్రజలు ఎటు వెళ్లాలన్నా సుదూర ప్రయాణం చేయాల్సి వస్తుంది. ఏటా ఇదే పరిస్థితి ఉంటోంది. వానాకాలంలో ప్రజలు ఎదుర్కొంటున్న ఈ ఇక్కట్లను దూరం చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది.

- (ఆంధ్రజ్యోతి, యాదాద్రి)

వానాకాలంలో వలిగొండ మండలం బొల్లెపల్లి-సంగెం వద్ద, బీబీనగర్ మండలం జూలూరు వద్ద మూసీ కాల్వ పరవళ్లు తొక్కి రాకపోకలు నిలుస్తుంటాయి. భారీ వర్షాలు కురిసిన పక్షంలో భువనగిరి, బీబీనగర్, వలిగొండ, భూదాన్‌పోచంపల్లి, చౌటుప్పల్ మండలాల్లోని పలు ప్రాంతాలకు రాకపోకలు నిలుస్తున్నాయి. ఈ ప్రాంతాల్లో హైలెవల్ బ్రిడ్జీలు నిర్మించాలని స్థానిక ప్రజలు ఏళ్లుగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ వస్తున్నారు. దీంతో తాజాగా ప్రభుత్వం బొల్లెపల్లి-సంగెం వద్ద హైలెవల్ బ్రిడ్జి నిర్మించేందుకు నిధులు మంజూరు చేసింది. మూసీ లోలెవల్ బ్రిడ్జి 3వ కిలోమీటరు నుంచి 3.6వ కిలోమీటర్ వరకు హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.45కోట్లు మంజూరు చేసింది. త్వరలో టెండర్ల ప్రక్రియ చేపట్టి, పనులు ప్రారంభించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ప్రస్తుతం ఉన్న లోలెవల్ బ్రిడ్జి స్థానంలో హైలెవల్ బ్రిడ్జి నిర్మించనుండటంతో భువనగిరి, బీబీనగర్, వలిగొండ మండలాల్లోని ప్రజలు భూదాన్‌పోచంపల్లి, చౌటుప్పల్ ప్రాంతాలకు సులువుగా వెళ్లగలరు. అంతేగాక వానాకాలంలో ఈ ప్రాంత ప్రజలకు ఎదురవుతున్న ఇబ్బందులు తప్పనున్నాయి.

సీఎం చొరవతో..

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గత ఏడాది నవంబరులో వలిగొండ మండలం సంగెం బ్రిడ్జి వద్ద మూసీ పునరుజ్జీవం పాదయాత్రను ప్రారంభించారు. స్థానిక ప్రజలు మూసీ కాలుష్యంతో పడుతున్న ఇబ్బందులను, మూసీ ప్రక్షాళన ఆవశ్యకతను ఆయన వివరించారు. వివిధ కులవృత్తులు, రైతులతో మమేకం అయ్యారు. సంగెం వద్ద మూసీ పరివాహక ప్రాంత ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. మూసీ ప్రక్షాళన ఓ సంకల్పంతో చేపట్టామని, ఎవరు అడ్డుపడినా పూర్తిచేసి తీరుతామని ప్రకటించారు. మూసీ నది ఉప్పొంగినప్పుడు సంగెం-వలిగొండ, జూలూరు-పెద్దరావులపల్లి అండర్ బ్రిడ్జీలు మునిగి భువనగిరి, బీబీనగర్, చౌటుప్పల్, వలిగొండ మండలాలకు రాకపోకలు నిలుస్తున్నాయని ఇక్కడ హైలెవల్ బ్రిడ్జీలు నిర్మించాలని స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి సీఎంకు విన్నవించారు. దీనిపై సీఎం స్పందించి అందుకు పూర్తిస్థాయి నివేదికను అందించాలని, వెంటనే నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు సంబంధిత అధికారులు బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదించారు. ఇక్కడ హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి

- మిగతా 8వ పేజీలో...

బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు

బొల్లెపల్లి-సంగెం వద్ద హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ముఖ్యమంత్రి మూసీ పర్యటనలో భాగంగా హామీ మేరకు బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదించాం. ప్రభుత్వం మూసీ లోలెవల్ బ్రిడ్జి 3వకిలోమీటరు నుంచి 3.6వ కిలోమీటర్ వరకు హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.45 కోట్లు కేటాయిస్తూ నిర్ణయం తీసుకుంది. రోడ్డు, భవనాలశాఖ ఆధ్వర్యంలో ఈ బ్రిడ్జిని నిర్మించనున్నాం. త్వరలో టెండర్ల ప్రక్రియను పూర్తిచేసి పనులు ప్రారంభిస్తాం.

- బాల ప్రసాద్, రోడ్లు భవనాలశాఖ ఈఈ

బ్రిడ్జి నిర్మాణంతో సులువు ప్రయాణం



భారీ వర్షాలు కురిసిన పక్షంలో మూసీ పరవళ్లు తొక్కడంతో బొల్లెపల్లి-సంగెం వద్ద రోజులు పాటు ఈ ప్రాంత వాసులకు రాకపోకలు నిలిచిపోతాయి. మూసీ త్రివేణి సంగమం వద్ద బ్రిడ్జి నిర్మాణం గత 35 ఏళ్లుగా ప్రభుత్వాలు ప్రతిపాదనలకే పరిమితం చేశాయి. భారీ వర్షాలు కురిసిన పక్షంలో వలిగొండ, భువనగిరి, చౌటుప్పల్ మండలాల్లోని పలు గ్రామాలకు రాకపోకలు నిలుస్తున్నాయి. సంగెంవద్ద హైలెవల్ బ్రిడ్జినిర్మిస్తే ఈ ప్రాంత ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుంది.

- పన్నీరు శివకుమార్, బొల్లేపల్లి గ్రామస్థుడు

సోమేశ్వరాలయ అభివృద్ధికి
కేంద్రం సానుకూలం

» అధికారులకు ఆదేశాలు జారీచేసిన కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ » ఎంపీ చామల వెల్లడి



ఆలేరు మండలం కొలనుపాకలోని సోమేశ్వరాలయం

ఆలేరురూరల్,జూలై 8 (ఆంధ్రజ్యోతి): కొలనుపాకలోని ప్రసిద్ధ సోమేశ్వరాలయ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. ఆలయాన్ని ప్రసాద్ పథకం 2.0లో చేర్చి అభివృద్ధి చేయాలని కేంద్ర సాంస్కృతిక, పర్యాటకశాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ సంబంధిత శాఖలకు ఆదేశాలిచ్చారని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మే 21న కేంద్ర మంతి గజేంద్రసింగ్ షెకావత్‌ను కలిసి వినతి పత్రం అందజేసినట్టు తెలిపారు. చాళుక్యుల కాలం నాటి ప్రాచీన శివాలయం, శిల్ప కళ, చరిత్రక శాసనాలు, మతపర ప్రాముఖ్యం ఉన్న ఈ ఆలయం కాకతీయుల కాలంలో ఎంతో ప్రసిద్ధి చెందిందని మంత్రికి వివరించినట్టు పేర్కొన్నారు. ఇక్కడికి ఏటా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచేగాక వివిధ రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చి దర్శనం చేసుకుంటారని వివరించానన్నారు. సోమేశ్వరాలయం సమీపంలో 2,000 ఏళ్ల చరిత్ర కలిగిన జైన మందిరం ఉందని, కొలనుపాక బహుళ మతాలకు యాత్రా క్షేత్రంగా విరాజిల్లుతోందని ఆయన దృష్టికి తీసుకెళ్లానన్నారు. దీంతో కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించడం హర్షణీయమన్నారు. జాతీయ రహదారి 163 పక్కనే ఉన్న ఈ ఆలయాన్ని ప్రసాద్ పథకం 2.0లో చేర్చడం ద్వారా పర్యాటక వసతులు, శిల్పాల పరిరక్షణ, సుందరీకరణ, డిజిటల్ మ్యూజియం అభివృద్ధికి నిధులు లభిస్తాయని తెలిపారు. అంతేగాక ఆలయం అభివృద్ధి ద్వారా ఈ ప్రాంతం పర్యాటకంగా ఆర్థికంగా అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రికి చామల కృతజ్ఞతలు తెలిపారు.

మహిళల ఆర్థిక బలోపేతానికి
కృషి చేయాలి

అదనపు కలెక్టర్ ఏ.భాస్కరరావు



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు

భువనగిరి (కలెక్టరేట్)/ బీబీనగర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మహిళా సమగ్రతపై అవగాహన కల్పిస్తూ మహిళా సంఘాల సభ్యుల ఆర్థిక బలోపేతానికి కృషి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు అన్నారు. మహిళా శక్తి సంబరాల్లో భాగంగా జిల్లాలోని మునిసిపల్ కమిషనర్లు, రిసోర్సు పర్సన్లతో ఆయన మంగళవారం కలెక్టరేట్‌లో అవగాహన సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఇందిరా మహిళా శక్తి సంబరాలను జిల్లాలో ఘనంగా నిర్వహించేందుకు మహిళా సంఘాల సమావేశాలు, కళాజాత కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఇందిరమ్మ గృహ లబ్ధిదారులను గుర్తించి, అవసరమైన బ్యాంకు లోన్లు, స్త్రీనిధి లబ్ధి, సీఐఎఫ్ నిధుల ద్వారా ఆర్థిక సాయం అందించాలన్నారు. సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి టీ.నాగిరెడ్డి, మున్సిపల్ కమిషనర్లు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం బీబీనగర్‌లోని మండల సమాఖ్య భవనంలో నిర్వహిస్తున్న ఇందిర మహిళాశక్తి కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈసందర్భంగా భాస్కర్ రావు మాట్లాడుతూ మహిళల ఆర్థిక పరిపుష్టితో పాటు సామాజిక అభివృద్ధి కోసం ప్రభుత్వం 18 రకాల కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. సంఘాలలో చేరని మహిళలను సభ్యులుగా చేర్పించాలని, కిశోర బాలికలు, దివ్యాంగుల సంఘాలను కూడా ఏర్పాటు చేయాలని ఐకేపీ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, ఐకేపీ ఏపీఎం శ్రీనివాస్‌తో పాటు సీసీలు పాల్గొన్నారు.

బీబీనగర్ ఎయిమ్స్‌లో అందుబాటులోకి 'భీష్మ క్యూబ్స్'



ఎయిమ్స్‌లో మాట్లాడుతున్న రిటైర్డ్ ఎయిర్ మార్షల్ ప్రొఫెసర్ డాక్టర్ తన్మయ్ రాయ్

బీబీనగర్ (ఎయిమ్స్), జూలై 8 (ఆంధ్రజ్యోతి): బీబీనగర్ ఎయిమ్స్‌లోకి భీష్మ క్యూబ్స్ అందుబాటులోకి వచ్చాయని రిటైర్డ్ ఎయిర్ మార్షల్ ప్రొఫెసర్ డాక్టర్ తన్మయ్ రాయ్ అన్నారు. మంగళవారం బీబీనగర్ మండలంలోని ఎయిమ్స్‌లో డిజాస్టర్ మెనేజ్‌మెంట్ భీష్మ క్యూబ్స్ ఓరియంటేషన్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికసిత్ భారత్‌లో భాగంగా 2023 జనవరి 31న ఆరోగ్య మైత్రి ప్రారంభంలో భాగంగా దీనిని ఏర్పాటు చేయడానికి ఆలోచన వచ్చిందన్నారు. విదేశాలకు కూడా వీటిని అందజేశామని తెలిపారు. మన దేశంలో కూడా వినియోగిస్తున్నామని తెలిపారు. ఏదైనా ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు కేవలం అతి త్వరగా వైద్యం అందించేందుకు ఇందులో అనేక రకాల శస్త్ర చికిత్సలకు సంబంధించిన పరికరాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఆక్సిజన్ అందిస్తుందని తెలిపారు. ఇతర ప్రాంతాలకు కూడా సులభంగా తరలించడానికి వీలవుతుందని తెలిపారు. కార్యక్రమంలో డీన్ డాక్టర్ సంఫీుత సంపత్, ఎయిమ్స్ సూపరింటెండెంట్ అభిషేక్ రాయ్, భీష్మ క్యూబ్స్ నోడల్ అధికారి డాక్టర్ మహేశ్వర్‌రెడ్డి, సిద్దార్థరావు, డాక్టర్లు, సిబ్బంది, మెడికల్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

భూభారతి దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలి

కలెక్టర్ హనుమంతరావు



గుట్టలో రెవెన్యూ సదస్సు వివరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ హనుమంతరావు

యాదగిరిగుట్ట రూరల్, జూలై 8, (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులో భూ భారతిలో వివిధ భూ సమస్యలపై వచ్చిన దరఖాస్తులను రెవెన్యూ అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, వాటిని పరిష్కరించాలని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. దరఖాస్తుల పరిష్కారానికి చేపడుతున్న చర్యలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి సంబంధించిన అన్ని దరఖాస్తులను పూర్తిచేయాలన్నారు.

అన్ని మాడ్యూల్స్‌లో దాఖలైన భూ భారతి దరఖాస్తులను వెంటనే పరిష్కరించేందుకు చొరవతీసుకోవాలని కోరారు. ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తులను మండల తహసీల్దార్ లాగిన్ ఉన్న దరఖాస్తులను వేగవంతం పరిష్కరించేందుకు కృషి చేయాలని అధికారులకు సూచించారు. రెవెన్యూ పరంగా ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులపై ఎంపీడీవో సమీక్షిస్తూ ఇప్పటి వరకు ఇళ్లు ఎన్ని మంజూరయ్యాయని, ఇంకా నిర్మాణాలు మొదలు పెట్టని వారితో మాట్లాడి వారి ఆర్థిక పరిస్థితుల గురించి తెలుసుకుని డబ్బులు లేకపోతే మహిళా సంఘాల ద్వారా రుణాలు ఇప్పించి, త్వరగా ఇళ్ల నిర్మాణాలు మొదలు పెట్టేలా చర్యలు చేపట్టాలన్నారు. పురోగతిలో ఉన్న ఇళ్ల నిర్మాణం వేగవంతంగా పూర్తి చేసేలా అధికారులు కృషి చేయాలని కోరారు. ఇళ్ల నిర్మాణం పూర్తయినవారు త్వరగా గృహ ప్రవేశాలు చేయాలన్నారు.

ప్రతీ సోమవారం బేస్మెంట్ లెవల్ పిల్లర్ల లెవల్, స్లాబ్ లెవల్ పూర్తి అయిన వారి ఖాతాలలో డబ్బులు జమచేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎంపీడీవో నవీన్‌కుమార్, ఎంఆర్ఐ శ్రీకాంత్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

మనిషి మనుగడకు చెట్లే జీవనాధారం

జడ్పీ సీఈవో శోభారాణి



అనాజీపురంలో వనమహోత్సవంలో మొక్క నాటుతున్న జడ్పీ సీఈవో శోభారాణి

భువనగిరి రూరల్, జూలై 8(ఆంధ్రజ్యోతి): మనిషి మనుగడకు చెట్లే జీవనాధారమని ప్రతీ ఒక్కరు మొక్కలు పెంచాలని జడ్పీ సీఈవో ఎస్.శోభారాణి అన్నారు. మంగళవారం మండలంలోని అనాజిపురం రైతు వేదిక ఆవరణలో వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా మొక్కలను నాటి నీరు పోశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములై మొక్కలు నాటాలన్నారు. వనమహోత్సవ కార్యక్రమాన్ని ఒక యజ్ఞంలా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సీహెచ్ శ్రీనివాస్, ఎంపీవో దినకర్, పంచాయతీ కార్యదర్శులు మునగాల శ్రీనివాస్, వెంకటేశ్, లోకేశ్, శివారెడ్డి, పద్మారెడ్డి,అనిల్, చంద్రయ్య, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు. అనంతరం భువనగిరి మండలంలోని పలు గ్రామాల్లో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు ఇందిరమ్మ ఇళ్లను త్వరితగతిన పూర్తి చేసుకుని లబ్ధి పొందాలన్నారు. బేస్‌మెంట్ పూర్తయిన లబ్ధిదారులకు రూ.లక్ష మంజూరు చేయాలని ఎంపీడీవో శ్రీనివాస్, ఏంపీవో దినకర్‌కు సూచించారు.

గర్భస్థ లింగ నిర్ధారణ నేరం



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో మనోహర్

భువనగిరి(కలెక్టరేట్), జూలై 8 (ఆంధ్రజ్యోతి) : గర్భస్థ లింగ నిర్ధారణ నేరమని, ఆ చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా, వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎం మనోహర్ అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం జిల్లా ఆశా నోడల్ అధికారి, ఫెసిలిటేటర్స్‌తో గర్భస్థ లింగనిర్ధారణపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆడబిడ్డను పుట్టనిద్దాం, బ్రతుకునిద్దాం నినాదంతో ఆడ-మగ సమానత్వంపై ప్రజల్లో అవగాహన పెంచాలన్నా రు. శరీరం, మనస్సు సిద్ధంగా ఉన్నప్పుడే తల్లి కావాలనే నినాదంతో ఈ నెల 11 నుంచి 18 వరకు ప్రపంచ జనాభా దినోత్సవంపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఏఎన్‌సీ రిజిస్ట్రేషన్లు పెంచి ఆసుపత్రుల్లో అందుతున్న ప్రసవ సేవలను గర్భిణులకు వివరించి, అబార్షన్ల రేటును తగ్గించాలన్నారు. 100 శాతం వ్యాధి నిరోధక టీకాలు జరిగేట్లుగా చూడాలని, ఆయుష్మాన్, ఆరోగ్య మందిరాల సేవలు బలోపేతానికి ఆశా నోడల్ అధికారులు ఆసుపత్రులను సందర్శించాలన్నారు. వర్షాకాలం ప్రారంభమైన సందర్భంగా డెంగీ,మలేరియా, టైఫాయిడ్, డయేరియా వంటి సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంద ని అప్రమత్తంగా ఉండాలన్నారు. సీజనల్ అంటువ్యాధుల కట్టడికి గ్రామం, మండలం, జిల్లా స్థాయిలో ర్యాపిడ్ రెస్పాన్స్ బృందాలను ఏర్పాటుచేశామన్నారు. సమావేశంలో పీవో శిల్పిని, డిప్యూటీ డీఎంహెచ్‌వో యశోద, వైద్యులు సాయిశోభ, సుమన్ కళ్యాణ్, రామక్రిష్ణ, వీణ, ఆశ నోడల్ అధికారి దార సత్యవతి, హెల్త్ ఎడ్యుకేటర్లు వసంత, సత్యనారాయణ, పీహెచ్‌సీల ఆశా నోడల్ అధికారులు, ఫెసిలిటేటర్లు పాల్గొన్నారు.

ఓటరు నమోదుపై అవగాహన పెంచాలి

అదనపు కలెక్టర్ వీరారెడ్డి



గుట్టలో బీఎల్‌వోల సమావేశంలో మాట్లాడుతున్న వీరారెడ్డి


యాదగిరిగుట్ట రూరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ వీరారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బీఎల్‌వోలకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫాం-6, 7, 8పై బీఎల్‌వోలకు పూర్తి అవగాహన ఉండాలన్నారు. ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు గురికాకుండా బోగస్ ఓటర్లను గుర్తించి తొలగించాలని, స్థానికంగా నివాసం ఉండే ప్రతీ ఒక్కరికి ఓటుహక్కు కల్పించాలన్నారు. కొంతమంది తల్లిదండ్రులు ఆడపిల్లలకు ఓటు హక్కు నమోదు చేయించడంలో నిర్లక్ష్యంగా వ్యవరిస్తున్నారని, అలాంటి వారికి పూర్తి అవగాహన కల్పించాలన్నారు. పదో తరగతి పూర్తయిన విద్యార్థుల జాబితాను మండల పరిధిలోని పాఠశాలల నుంచి సేకరించి వారు జన్మించిన తేదీ ఆధారంగా పేర్లలో తప్పులు దొర్లకుండా ఓటు నమోదు చేసుకొనేలా చొరవ తీసుకోవాలన్నారు. ఒకే కుటుంబానికి చెందిన వారంతా ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా బూత్‌లెవల్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గత పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో నియోజకవర్గంలో 90శాతం కంటే అధికంగా పోలింగ్ నమోదైందని, పోలింగ్ శాతాన్ని మరింత పెంచేందుకు ప్రతీ ఒక్కరు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ గణేష్‌నాయక్, డీటీ సత్యనారాయణ, ఎంఈవో శరత్‌యామిని, తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారంగా భోజనం అందించాలి...

విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం మెనూ ప్రకారంగా అందించాలని అదనపు కలెక్టర్ వీరారెడ్డి ఆదేశించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం వడ్డించాలని, తప్పని సరిగా గుడ్డు అందించాలని ఆదేశించారు. ఆయన వెంట ఎంఈవో శరత్‌యామిని, తదితరులు ఉన్నారు.

డంపింగ్ యార్డును ఉపసంహరించుకోవాలి


ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యేకు పిలాయిపల్లి గ్రామస్థుల వినతి



ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి వినతిపత్రాన్ని అందజేస్తున్న గ్రామస్థులు

భూదాన్‌పోచంపల్లి, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : భూదాన్ పోచంపల్లి మండల పరిధిలోని పిలాయిపల్లి గ్రామానికి చేరువలో ఉన్న బండ రావిరాల గ్రామశివారులో ఏర్పాటు చేయనున్న డంపింగ్ యార్డును ఉపసంహరించుకోవాలని గ్రామస్థులు కోరారు. ఈమేరకు మంగళవారం పిలాయిపల్లి గ్రామానికి చెందిన డీసీసీ ఉపాధ్యక్షుడు కళ్లెం రాఘవరెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్థులు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిసి సమస్యలు వివరించారు. ఇప్పటికే పిలాయిపల్లిలో క్రషర్ మిషన్ల ఏర్పాటుతో గాలి కాలుష్యమైందన్నారు. రైస్ మిల్లుల కాలుష్యం, గుట్టలు మైనింగ్ క్రషర్‌లు, మూసీ కాలుష్యం, దుస్తుల కంపెనీల వ్యర్థ రసాయనాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, సర్వేనెంబరు 268లోని భూమిలో డంపింగ్ ఏర్పాటుకు అధికారులు ప్రయత్నాలు సాగిస్తున్నందున దాని ఏర్పాటును ఉపసంహరించుకోవాలని విజ్ఞప్తి చేశారు. డంపింగ్‌ను ఇతర ప్రాంతానికి తరలించాలని కోరారు. కార్యక్రమంలో కళ్లెం రాఘవరెడ్డి, జి.భూషణంగౌడ్, ఎ.అంజయ్య, డి.నర్సయ్య, బి.దర్శన్ పాల్గొన్నారు.

కలెక్టరమ్మ పంతులమ్మగా మారి..



నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి పంతులమ్మగా మారి విద్యార్థులకు పాఠాలు బోధించారు. మంగళవారం నాంపల్లి మండలకేంద్రంలోని కస్తూర్బా పాఠశాలను సందర్శించారు. ఓ తరగతి గదిలో కాసేపు ఉపాధ్యాయురాలిగా మారి విద్యార్థులకు పాఠాలు బోధించారు. విద్యార్థులను ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. పాఠశాలలో సమస్యలు ఉన్నాయని ఉపాధ్యాయులు చెప్పడంతో తనకు నివేదిక ఇవ్వాలని కలెక్టర్ మండల అధికారులను ఆదేశించారు.

● ఆంధ్రజ్యోతి, నాంపల్లి

సొంతగూడు ఎలా ఉంది?



యాదాద్రిభువనగిరి జిల్లా బీబీనగర్ మండలంలోని రుద్రవెల్లి గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇంటిని కలెక్టర్ హనుమంతరావు మంగళవారం పరిశీలించారు. ఇంటి నిర్మాణం త్వరగా పూర్తి చేసి గృహ ప్రవేశం చేయాలని లబ్ధిదారురాలికి సూచించారు. నిర్ణీత సమయంలో నాణ్యతా ప్రమాణాలతో నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, హౌసింగ్ ఏఈ గీత, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి, బీబీనగర్

రైతుగా మారి నారు పంచి



నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం రైతులా మారారు. మంగళవారం నల్లగొండ జిల్లా నకిరేకల్ మండలం కడపర్తి గ్రామ శివారులోని వ్యవసాయ క్షేత్రంలో వరినారు పంచారు. మహిళలు నాటు వేస్తున్న క్రమంలో ఆయన ప్రత్యేకంగా వరినారు పంచారు. రైతులాగా బురద పొలంలోదిగి నారు పంచడాన్ని చూసిన రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

● ఆంధ్రజ్యోతి, నకిరేకల్

విద్యుదాఘాతంతో రైతు మృతి

● యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్‌లో ఘటన



నరేశ్‌నాయక్ (ఫైల్)

బీబీనగర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): పొలంలో మోటారును ఆన్ చేస్తూ విద్యుదాఘాతానికి గురై ఓ రైతు మృతి చెందాడు. యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం రావిపహాడ్ తండాలో ఈ సంఘటన జరిగింది. సీఐ ప్రభాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం భానోతు నరేశ్‌నాయక్ (25) గ్రామ శివారులోని తన సొంత భూమితో పాటు మరికొంత భూమిని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. ఏడాది క్రితం నరేశ్‌నాయక్‌కు వివాహమైంది. మంగళవారం ఉదయం 11గంటల సమయంలో పొలానికి నీళ్లు పెట్టి వస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. మధ్యాహ్నం ఇంటికి రాకపోవడంతో భార్య రేణుక ఫోన్ చేయగా, సమాధానమివ్వకపోడంతో పొలం వద్దకు వెళ్లింది. అక్కడ బోరు మోటార్ స్టార్టర్ బాక్సు వద్ద కుడికాలుకు విద్యుత్ వైరు తగిలి విద్యుదాఘాతానికి గురై మృతిచెందినట్లు గుర్తించింది. విగతజీవిగా పడి ఉన్న భర్తను చూసి కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పంచనామ నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య రేణుక ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బైక్‌లు చోరీ చేస్తున్న దొంగ అరెస్టు



ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు

నల్లగొండ, జూలై 8(ఆంధ్రజ్యోతి): కొంతకాలంగా నల్లగొండ జిల్లా నల్లగొండ, హాలియా, మిర్యాలగూడ, వాడపల్లి ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాల దొంగతనాలకు పాల్పడుతున్న నేరస్తుడిని పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిడమనూరు మండలంలోని బొకమంతలపహాడ్ గ్రామానికి చెందిన కొండేటి సంతోష్ కుమార్ తాగుడు, ఇతర వ్యసనాలకు అలవాటు పడ్డాడు. అతనితో పాటు కూలీ పనులకు వచ్చే మరో మైనర్ బాలుడితో స్నేహం చేసి ఇద్దరూ కలిసి ద్విచక్ర వాహనాలను దొంగతనం చేయాలని నిర్ణయించుకున్నారు. హాలియాలో దొంగతనం చేసిన ఒక ద్విచక్ర వాహనాన్ని గుంటూరులో విక్రయించిగా వచ్చిన డబ్బులతో జల్సాలు చేశారు. మంగళవారం ఉదయం ఆరు గంటల సమయంలో జిల్లాకేంద్రంలోని పానగల్లు బైపాస్ రోడ్డు వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా సంతోష్‌కుమార్ మైనర్ బాలుడితో కలిసి బైక్‌పై వెళ్తుండగా అనుమానాస్పదంగా కన్పించడంతో అదుపులోకి తీసుకొని విచారించారు. వారి నుంచి రూ.4లక్షల విలువైన ఐదు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. డీఎస్పీ కె. శివరాంరెడ్డి పర్యవేక్షణలో నల్లగొండ టూటౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాఘవరావు ఆధ్వర్యంలో కేసు చేధించిన నల్లగొండ టూటౌన్ ఎస్ఐ సైదులు, సిబ్బంది రాజు, బాలకోటిలను ఎస్పీ శరత్ చంద్రపవార్ అభినందించారు.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి

మఠంపల్లి, జూలై 8(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పదస్థితిలో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండల కేంద్రంలోని యాదాద్రి టౌన్‌షిప్‌లో మంగళవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామంలో భిక్షాటన చేస్తూ చేతిలో బాటిల్ పట్టుకొని తిరుగుతుండే వ్యక్తి రెండు రోజుల క్రితం టౌన్‌షిప్‌లోకి వచ్చి వెళ్లాడు. మంగళవారం టౌన్‌షిప్‌లోని కంపచెట్ల ఖాళీ స్థలంలో మృతిచెందిఉండడంతో అటుగా వెళ్లిన కాలనీవాసులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గ్రామపంచాయతీ సిబ్బంది సహాయంతో మృతదేహాన్ని హుజూర్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

రైలు పట్టాలు దాటబోయి..

ఆలేరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): పట్టాలు దాటబోయిన వృద్ధుడు రైలు కిందపడి వృద్ధుడు మృతిచెందాడు. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరు పట్టణంలో మంగళవారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని పోచమ్మగుడి ప్రాంతానికి చెందిన పాశికంటి లక్ష్మీకాంత్ (75) సాయంత్రం పనినిమిత్తం రైల్వే గేటు ప్రాంతంలోని మెయిన్ రోడ్డుకు వచ్చి తిరిగి ఇంటికి చేరుకునేందుకు రైలు పట్టాలు దాటి వెళ్లేందుకు ప్రయత్నించాడు. ప్రమాదవశాత్తు కాలు పట్టాకు తాకి పట్టాల మధ్య పడిపోయాడు. గమనించి కొందరు అతన్ని తీసేందుకు ప్రయత్నించబోయారు. ఇంతలో అదే రైలు మార్గంలో సికింద్రాబాద్ నుంచి ఖాజీపేట జంక్షన్ వైపు వెళ్తున్న శాతవాహన ఎక్స్‌ప్రెస్ వృద్ధుడిపై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. భువనగిరి రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

తిప్పర్తి: రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మంగళవారం సాయంత్రం నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలంలోని రాయినిగూడెం-నల్లగొండ రైల్వేస్టేషన్ల మధ్య జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సుమారు వయస్సు 25 సంవత్సరాలు కలిగిన యువకుడు కొల్లం నుంచి హైద్రాబాద్‌కు వెళ్తున్న ప్రత్యేక రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు చామఛాయ రంగు కలిగి 5.4 ఎత్తు ఉన్నాడు. మృతదేహంపై నీలిరంగు షర్ట్, నలుపురంగు ప్యాంట్ ఉంది. మృతదేహాన్ని నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్ఐ బి. రామకృష్ణ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడికి గాయాలు

వలిగొండ, జూలై 8(ఆంధ్రజ్యోతి): బైక్ ఢీకొని బాలుడికి గాయాలయ్యాయి. ఎస్ఐ యుగేందర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. రామన్నపేట మండలం వెల్లంకి గ్రామానికి చెందిన కర్రె గౌతమి, ఆమె కుమారుడు హరిష్‌చంద్ర మండలంలోని పహిల్వాన్‌పురంలో ఉన్న తమ సమీప బంధువు ఇంటికి వెళ్లి తిరుగు ప్రయాణంలో హైదరాబాద్ వెళ్లడానికి ఈ నెల 5వ తేదీన టేకుల సోమారం గ్రామ బస్‌స్టాప్ వద్ద ఉన్నాడు. ఒక ద్విచక్ర వాహనదారుడు నిర్లక్ష్యంగా వాహనం నడుపుతూ బస్‌స్టాప్‌లో నిలుచున్న హరిష్ చంద్రను ఢీ కొట్టాడు. గాయపడిన బాలుడిని భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం సికింద్రాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. వారి బంధువు సంజీవ మంగళవారం ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రెండు గ్రామాల ఇసుక పంచాయితీ

● తహసీల్దార్ కార్యాలయం వద్దే రెండు గ్రామాల ట్రాక్టర్ యజమానుల ఘర్షణ ● పోలీస్‌స్టేషన్లలో పరస్పర ఫిర్యాదులు



ధర్మారెడ్డిగూడెం గ్రామంలోని ఇసుక వాగు



తహసీల్దార్ కార్యాలయం వద్ద ఘర్షణ పడుతున్న ఇసుక ట్రాక్టర్ యజమానులు

యాదగిరిగుట్ట రూరల్, జూలై 8,(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి కావల్సిన ఇసుక తరలింపు పంచాయితీ యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలంలోని ధర్మారెడ్డిగూడెం, మాసాయిపేట గ్రామాల మధ్య చిచ్చుపెడుతోంది. తమ గ్రామానికి రావొద్దని ధర్మారెడ్డిగూడెం, ఎందుకు రావొద్దని మాసాయిపేట గ్రామాలకు చెందిన ట్రాక్టర్ యజమానులు వాదించుకున్నారు. మంగళవారం యాదగిరిగుట్ట తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఘర్షణకు దిగారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించారు. మండలంలోని ధర్మారెడ్డిగూడెం గ్రామ శివారు ప్రాంతంలో గోదావరి జలాలతో వాగు రావడంతో స్వచ్ఛమైన ఇసుక తరలివచ్చింది. దీంతో ధర్మారెడ్డిగూడెం, మాసాయిపేట గ్రామాల మధ్య పంచాయితీకి ఆజ్యం పోసింది. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి మండలంలోని ఏగ్రామంలో ఇసుక ఉన్నా ఇళ్ల నిర్మాణానికి సంబంధిత రెవెన్యూ అధికారులతో ఇసుక తీసుకరావడానికి ప్రభుత్వం ఆదేశాలు ఉన్నాయి. అయినప్పటికీ తమ గ్రామ రెవెన్యూ పరిధిలోనే ఇసుక ఉందని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు తమ ట్రాక్టర్ల ద్వారానే తరలిస్తామని ఇతర గ్రామాలకు చెందిన వారు ఎవరూ రావద్దని అంటున్నారు. మరోవైపు మాసాయిపేట గ్రామానికి చెందిన గ్రామస్థులు తమ ట్రాక్టర్ల ద్వార ఇసుకను ఇందిరమ్మ ఇళ్లకు తరలిస్తామని అనడంతో ఇరు గ్రామాల మధ్య వివాదం జరిగింది. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో ఇసుకకు ధర పలుకుతుండడంతో గ్రామస్థుల మధ్యపోటీ పెరిగింది. రెవెన్యూ అధికారులు , పోలీస్ అధికారులు సర్దిచెప్పినప్పటికీ ససేమిరా అంటున్నారు. మండలంలో ఏ గ్రామంలో ఇసుక ఉన్నా దానిని అన్ని గ్రామాలకు చెందిన ప్రజలు వాడుకోవచ్చునని ఏ గ్రామానికి సొంతం కాదని ఎవరైనా అడ్డుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని రెవెన్యూ అధికారులు, పోలీసు హెచ్చరిస్తున్నారు. అయినప్పటికీ ఇరు గ్రామాలకు చెందిన ప్రజలు అమీతుమీ తేల్చుకుందామని పట్టుదలతో ఉన్నారు. ఈ సమస్య ఎంతవరకు వెళ్తుందోనని ఇరుగ్రామాల మధ్య ఉత్కంఠ వాతావరణం నెలకొంది.

ఇసుక తరలింపు అడ్డుకుంటే క్రిమినల్ కేసులు పెడతాం

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇసుక తరలించకుండా అడ్డుకుంటే క్రిమినల్ కేసులు పెడుతాం. మండలంలోని ఏగ్రామంలో ఇసుక ఉన్నా అందరూ తీసుకురావడానికి అవకాశం ఉంటుంది. ప్రభుత్వ ఆదేశాలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు.

● గణేష్‌నాయక్, తహసీల్దార్

నెమలి, జింక మాంసం విక్రేత అరెస్ట్



కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రాజశేఖర్‌రాజు

మిర్యాలగూడ అర్బన్, జూలై 8(ఆంధ్రజ్యోతి): నెమలి, జింక మాంసం విక్రేతను నల్లగొండజిల్లా మిర్యాలగూడ పోలీసులు అరెస్టుచేశారు. డీఎస్పీ రాజశేఖర్‌రాజు మంగళవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. నల్లగొండ జిల్లా వేములపల్లి మండలం శెట్టిపాలెం గ్రామానికి చెందిన నిమ్మల రమేష్ వృత్తిలో భాగంగా కూలి పనులకు వెళ్లడంతోపాటు చేపలు, కుందేళ్లు, అడవి పందుల వేటకు వెళ్లేవాడు. ఈ క్రమంలో ఎక్కువ ఆదాయాన్ని పొందాలనే ఆలోచనతో కొన్ని రోజులుగా అడవి పందులు, నెమళ్లను వేటాడడంతోపాటు తనకు పరిచయం ఉన్న రాజు అనే వ్యక్తి నుంచి జింక, దుప్పి మాంసాన్ని కూడా తీసుకొని వచ్చి తన ఇంట్లో విక్రయిస్తున్నాడని ఈ ఏడాది మార్చి 23వ తేదీన పోలీసులకు సమాచారం అందింది. దీంతో వేములపల్లి ఎస్ఐ తన సిబ్బందితో వెళ్లి దాడి చేయగా నిందితుడు రమేష్ పారిపోయాడు. రమేష్‌పై పోలీసులు వన్యప్రాణుల సంరక్షణ చట్టం ప్రకారం కేసు నమోదు చేశారు. మంగళవారం నిందితుడు రమేష్‌ను అదుపులోకి తీసుకోగా నేరాన్ని అంగీకరించినట్లు తెలిపారు. రెండు ఎయిర్ రైఫిల్స్, మాంసం కోసేందుకు ఉపయోగించే మూడు కత్తులు, అడవి పందుల వేటకు సంబంధించిన ఐదు వలలు, కుందేళ్ల వేటకు సంబంధించిన 15 ఉచ్చులను స్వాధీనం చేసుకున్నారు. సమావేశంలో మిర్యాలగూడ రూరల్ సీఐ పీఎన్‌డీ. ప్రసాద్, వేములపల్లి ఎస్ఐ వెంకటేశ్వర్లు ఉన్నారు.

వైద్యం వికటించి గర్భిణి మృతి

● యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో ఘటన

చౌటుప్పల్ రూరల్, జూలై 8(ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యం వికటించి ఓగర్భిణి మృతిచెందింది. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. రామన్నపేట మండలం వెల్లంకి గ్రామానికి చెందిన ఓ గర్భిణి చౌటుప్పల్‌లోని పోలీస్‌స్టేషన్ సమీపంలో ఉన్న ఓ ప్రైవేటు ఆసుపత్రికి సోమవారం పురిటినొప్పులతో ఆసుపత్రికి వచ్చింది. ఆపరేషన్ చేసిన అనంతరం బాబు జన్మించాడు. వైద్యం వికటించి, తల్లి పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్ ఓ ప్రైవేట్ ఆసుపత్రికి పంపించారు. అక్కడ వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు అప్పటికే తల్లి మృతిచెందిందని తెలిపారు. ఈ విషయం తెలుసుకుని కుటుంబ సభ్యులు, బంధువులు, ఆసుపత్రి చౌటుప్పల్‌లోని ఆస్పత్రి ఎదుట ఆందోళనకు సిద్ధం కావడంతో మంగళవారం మాట్లాడుతామని ఆస్పత్రి నిర్వాహకులు హామీ ఇచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో మృతురాలి బంధువులు, కుటుంబ సభ్యులు ఆసుపత్రి వైద్యులతో చర్చలు జరిపారు. రూ.12లక్షలు చెల్లించడానికి అంగీకరించినట్లు తెలిసింది. దీంతో బాధితులు పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు చేయలేదు.

భువనగిరిలో గర్భిణి ఆత్మహత్య



కవిత (ఫైల్)

భువనగిరి టౌన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): నాలుగు నెలల గర్భిణి ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన యాదాద్రి భువనగిరి జిల్లాకేంద్రంలో మంగళవారం జరిగింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... మోత్కూరుకు చెందిన వంగాల బాబు, నీరటి కవిత 2021లో ప్రేమ వివాహం చేసుకున్నారు. కొద్దికాలం తర్వాత వరకట్నం వేధింపులు ప్రారంభమయ్యాయి. ఎంఎస్సీ పూర్తి చేసిన కవిత స్థానిక ప్రైవేట్ కళాశాలలో ఉద్యోగం చేస్తూ కుటుంబాన్ని పోషించేది. భర్త బాబు ఏ పనిని కుదురుగా చేసేవాడు కాదు. ఈ క్రమంలో రెండుసార్లు ఆమెకు అబార్షన్లు అయ్యాయి. దీంతో కొంతకాలం క్రితం ఇద్దరు హైదరాబాద్‌కు వెళ్లారు. బాబు ఓ ప్రైవేట్ బ్యాంకు ఉద్యోగంలో చేరగా, కవిత ఇంటి వద్దే ఉంటున్న క్రమంలో మరోమారు గర్భం దాల్చింది. దీంతో నెల రోజుల క్రితం భువనగిరికి వచ్చి ఓ అద్దె ఇంటిలో ఉంటుండగా బాబు ఉద్యోగం కూడా భువనగిరిలో ఆ బ్యాంకుకు బదిలీ అయింది. ఇరువురి మధ్య వివాదాలు నిత్యకృత్యమయ్యాయి. ఈ నేపథ్యంలో బాబు మంగళవారం ఉదయం బ్యాంకుకు వెళ్లి మధ్యాహ్నం తిరిగి ఇంటికి రాగా కవిత తలుపు తీయకపోవడంతో చుట్టుపక్కల వారికి చెప్పాడు. అందరూ కలిసి బలవంతంగా తలుపులు తెరిచారు. అప్పటికే కవిత ఫ్యాన్‌కు ఉరిపోసుకొని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని జిల్లా ఆసుపత్రికి తరలించారు. బాబు తన కూతురిని హింసించి బలవంతంగా ఉరివేసి హత్య చేశాడని సునీత తల్లి లక్ష్మి ఆరోపించింది. కట్నం కోసం తరుచూ వేధించడంతో పలుసార్లు డబ్బులు ఇచ్చామని చెప్పింది. కూతురు ఒంటిపై ఉన్న బంగారు నగలు, వెండి పట్టీలను కూడా అమ్ముకున్నాడని ఆరోపించింది. లక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నకిలీ బంగారంతో ప్రజలకు బురిడీ

● అంతర్‌రాష్ట్ర దొంగల అరెస్టు ● నిందితుల నుంచి రూ.2.25 లక్షల నగదు స్వాధీనం

నిడమనూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): తక్కువ ధరకు అసలైన బంగారం ఇస్తామంటూ అమాయకులను మోసం చేస్తూ నకిలీ బంగారం అంటగట్టి ప్రజల నుంచి డబ్బులు వసూలు చేస్తున్న అంతర్‌రాష్ట్ర దొంగలను అరెస్టు చేసి పోలీసులు రిమాండ్‌కు తరలించారు. హాలియా సీఐ సతీష్‌రెడ్డి, నిడమనూరు ఎస్ఐ ఉప్పు సురేష్ తెలిపిన వివరాల ప్రకారం... ఏపీలోని ఒంగోలు జిల్లా చీమకుర్తి మండలం మర్రిచెట్టుపాలెం గ్రామానికి చెందిన పోలా నందు అలియాస్ ఆనందరావు, ఒంగోలు జిల్లా లింగసముద్రం మండలం జంపరోరిపాలెం గ్రామానికి చెందిన నాగలూరి ప్రకాశం అలియాస్ ప్రసాద్ ముఠాగా ఏర్పడి నల్లగొండ జిల్లాలోని వివిధ గ్రామాల్లో తిరుగుతూ పాములు పడతాము అంటూ ప్రజలను గుర్తిస్తున్నారు. తమ వద్ద అసలైన బంగారం ఉందని, తక్కువ ధరకే ఇస్తామంటూ ప్రజలను నమ్మిస్తూ వారి నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేస్తూ నకిలీ బంగారం అంటగడుతున్నారు. గతేడాది నల్లగొండ పట్టణంలో పానగల్ వద్ద ఓ వ్యక్తిని ఇదే విధంగా నమ్మించి నకిలీ బంగారం అంటగట్టి డబ్బులతో ఉడాయించారు. బాధితుడి ఫిర్యాదుతో పోలీసులు నిందితులను అరెస్టు చేసి జైలుకు తరలించారు. జైలు నుంచి విడుదలైన తర్వాత కూడా వారు ఇదే విధంగా ప్రజలను మోసం చేస్తున్నారు. ఈ క్రమంలో మే నెలలో నిడమనూరు మండలం గుంటుకగూడెం గ్రామంలో ఓ దంపతులను నమ్మించి నకిలీ బంగారం వస్తువులు ఇచ్చి రూ.3.50 లక్షల నగదుతో ఉడాయించారు. తమకు అంటగట్టిన బంగారు వస్తువులు నకిలీవని గుర్తించిన బాధితులు లబోదిబోమంటూ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు జిల్లా ఎస్పీ ఆదేశాలతో మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజు పర్యవేక్షణలో విచారణ ప్రారంభించారు.

ఈ నేపథ్యంలో మంగళవారం మండలంలోని ముకుందాపురం వద్ద పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరు వ్యక్తులను పట్టుకొని విచారించగా నకిలీ బంగారం అంటగట్టి డబ్బులు వసూలు చేస్తూ ప్రజలను మోసం చేస్తున్న దొంగల ముఠాగా పోలీసులు గుర్తించారు. నిందితులను అరెస్టు చేసి వారి వద్ద రూ.2.25 లక్షల నగదు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. కేసును ఛేదించిన సీఐ సతీష్‌రెడ్డి, ఎస్ఐ ఉప్పు సురేష్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ జితెందర్, ఎస్ఐ విజయ్‌కుమార్, హెచ్‌సీలు వహీద్‌పాషా, పుష్పగిరి, సిబ్బందిని జిల్లా ఎస్పీ శరత్ చంద్రపవార్ అభినందించారు.

రైతులకు ఎరువులు అందుబాటులో ఉంచాలి

నల్లగొండ టౌన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ సీజన్ ప్రారంభమై నెల రోజులు పూర్తి కావస్తున్నందున రైతులకు సరిపడా యూరియా, అన్ని రకాల కాంప్లెక్స్ ఎరువులు మండల స్థాయిలో అందుబాటులో ఉంచి ఎమ్మార్పీకే రైతులకు అందించాలని బీజేపీ కిసాన్ మోర్చా జాతీయ నాయకుడు గోలి మధుసూదన్‌రెడ్డి డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నల్లగొండ జేడీఏ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీ ప్రకారం యూరియాను రూ.266లకే విక్రయించాల్సి ఉండగా కొందరు డీలర్లు అధిక మొత్తంలో రైతుల నుంచి దోచుకుంటున్నారని ఆరోపించారు. మరి కొన్ని చోట్ల యూరియా బస్తా కావాలంటే అవసరం లేని ఎరువులను రైతులకు బలవంతంగా అంటగడుతున్నారని ఆరోపించారు. రవాణా చార్జీలు ప్రభుత్వం, ఎరువుల కంపెనీలు భరించి రైతులపై భారము పడకుండా అధికారులు చొరవ తీసుకోవాలన్నారు. జిల్లాలో వారం రోజుల నుంచి ప్రైవేట్ ఫర్టిలైజర్స్ డీలర్స్ యూరియా విక్రయించక పోవడంతో రైతులు యూరియా కోసం పడిగాపులు గాసి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా నాయకులు పిండి పాపిరెడ్డి, మాలే వెంకటరెడ్డి, బీజెపి రాష్ట్ర నాయకులు వీరెళ్లి చంద్రశేఖర్, పిల్లి రామరాజు యాదవ్, మిర్యాల వెంకన్న, మంగళపల్లి కిషన్, బీపంగి జగ్జీవన్, పాల్గొన్నారు.

ఎల్లమ్మ ఆలయంలో కుంకుమ అభిషేకం



కనగల్, జూలై 8:(ఆంధ్రజ్యోతి) నల్లగొండ జిల్లా కనగల్ మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద గల రేణుకా ఎల్లమ్మ ఆలయానికి మంగళవారం భక్తుల రద్దీ కొనసాగింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయంలో కుంకుమ అభిషేక పూజలను జరిపించి చీర సారె ఒడిబియ్యం బోన నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

అప్పుల బాధ తాళలేక యువకుడు..

భువనగిరి రూరల్, జూలై 8(ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం అనాజీపురంలో మంగళవారం రాత్రి జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కుప్పాల రఘు(21) కారును అద్దెకు నడుపుతు జీవనం కొనసాగిస్తున్నాడు. కారును ఓ ప్రైవేట్ బ్యాంకులో రుణం తీసుకుని కొనుగోలు చేశాడు. కాగా ఈ మధ్య కాలంలో కారు అద్దెకు నడవకపోవడంతో తీసుకున్న రుణం వాయిదాల పద్ధతిలో చెల్లించకపోవడంతో మృతుని తండ్రి కుప్పాల వెంకటేశ్ కుమారుడిని మందలించాడు. దీంతో రుణం తీర్చలేక మనస్తాపానికి గురై ఇంట్లో ఎవ్వరు లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన తండ్రి వెంకటేశ్ రూరల్ పోలీసులకు సమాచారం ఇచ్చాడు. రూరల్ ఎస్ఐ అనిల్‌కుమార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ఆసుపత్రి మార్చురికి తరలించారు. రఘు సోదరుడు కుప్పాల ఉపేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మొహర్రం జియారత్ వేడుకలు

నల్లగొండ టౌన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మొహర్రం పండుగలో భాగంగా నల్లగొండ జిల్లాకేంద్రం శివారు పానగల్లులో మంగళవారం జియారత్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పీర్ల కొట్టం వద్ద ముజవర్ మహ్మద్ సనోబర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఉరేగింపు కార్యక్రమం నిర్వహించి మిఠాయిలు పంపిణీ చేశారు. తమ పూర్వీకుల నుండి మొహర్రం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇటీవల కొందరు పీర్ల సావడి భూమిని అక్రమించుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బుర్రి యాదయ్య, సయ్యద్ అయాజ్, మహ్మద్ బషీర్, హఫీజ్, ఎండీ. సలీం, షరీఫ్, షేక్ సమీర్ ఉన్నారు.

చెర్వుగట్టు అభివృద్ధికి మాస్టర్ ప్లాన్

- మాస్టర్‌ప్లాన్ తయారీ కోసం సన్నాహాలు
- వారం క్రితం దేవస్థానాన్ని సందర్శించిన అధికారులు
- ఇప్పటికే ఉన్నత స్థాయి సమీక్ష
- మారనున్న ఆలయ చెర్వుగట్టు రూపురేఖలు



చెర్వుగట్టు కొండపై పరిసరాలను పరిశీలించిన ఉన్నతాధికారులు (ఫైల్)



నార్కట్‌పల్లి,జూలై 8(ఆంధ్రజ్యోతి):నల్లగొండ జిల్లాలో అతిపెద్ద పుణ్యక్షేత్రంగా ప్రసిద్ధ శైవక్షేత్రంగా విరాజిల్లుతున్న నార్కట్‌పల్లి మండ లంలోని చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి దేవస్థానానికి మహర్దశ పట్టనుందా?ఏళ్ల తరబడి అరకొర అభివృద్ధి పనులకే పరిమితమైన క్షేత్రాన్ని దీర్ఘకాల ప్రణాళికతో సమూలంగా అభివృద్ధి చేయనున్నారా? భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా ఆగమ శాస్త్రం ప్రకారం దేవస్థాన రూపురేఖలు పూర్తిగా మారనున్నాయా? దేవస్థాన స్థాయిని పెంచి పాలనాపరమైన సంస్కరణలు రానున్నాయని ఇటీవల జరిగిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంతో అవుననే సమాధానం వస్తోంది. రాష్ట్రంలోని ప్రధాన ఆలయాలను అభివృద్ధిచేయాలని సంకల్పించి ప్రభుత్వం నిర్ణయించిన జాబితాలో చెర్వుగట్టు దేవస్థానం ఉండడం,నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం విజ్ఞప్తిమేరకు దేవాదాయ ధర్మాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ,కమిషనర్‌స్థాయి కీలకఉన్నతాధి కారులు వారం క్రితం దేవస్థానాన్ని సందర్శించారు. సమీక్ష నిర్వహించి ఆగమ, వాస్తు సిద్ధాంతాలను అనుసరిస్తూ ఆధ్యాత్మిక ఉట్టిపడేలా ఏవిధంగా అభివృద్ధి పర్చాలనే అంశాలపై లోతుగా చర్చించి మాస్టర్ ప్లాన్ ప్రకారం చెర్వుగట్టు దేవస్థానాన్ని అభివృద్ధి చేస్తామని ప్రకటించడంపై భక్తుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.ఆలస్యంగానైనా చెర్వుగట్టు అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించడం శుభపరిణామమని భక్తులు భావిస్తున్నారు. చెర్వుగట్టు అభివృద్ధికి రూపొందించే మాస్టర్ ప్లాన్‌తో సమస్యలు తీరనున్నాయి.

మాస్టర్ ప్లాన్ అమలైతే..

మాస్టర్ ప్లాన్ అమలైతే దేవస్థానంలో ఇటు భక్తులు, అటు ఆలయ సిబ్బంది ఎదుర్కుంటున్న ప్రధాన సమస్యలన్నింటికీ ఒకే విడతలో పరిష్కారం లభించనుంది. ప్రధానంగా పర్వదిలు అమావాస్య సోమవారం, కార్తీకమాసాల్లో చెర్వుగట్టుకు వచ్చే భక్తుల సంఖ్య విపరీతంగా ఉండనుంది. భవిషత్‌లో ఇది మరింత పెరిగే అవకాశముంది. దీంతో ఘాట్ రోడ్ మీదుగా వాహనాల్లో గుట్టపైకి చేరుకుంటున్న భక్తులతో ట్రాఫిక్ సమస్య ఎదురవుతోంది. గుట్టపైన పార్కింగ్ ప్రదేశం లేకపోగా రెండో ఘాట్‌రోడ్ కూడా లేకపోవడంతో ఒకే దారిన వాహనాలు దిగడం, ఎక్కడం ఫలితంగా ట్రాఫిక్ స్థంబించి భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో దేవస్థానానికి తక్షణంగా ఘాట్‌రోడ్‌ను మాస్టర్ ప్లాన్‌లో చేర్చనున్నారు. ఎల్లారెడ్డిగూడెం నుంచి చెర్వుగట్టుకు ఉన్న రహదారిని రెండు లేదా నాలుగు వరుసల రహదారిగా విస్తరించనున్నారు. గుట్టపైనే మరో ప్రధాన దర్శనీయ స్థలం మూడుగుండ్లపైకి ప్రస్తుతం వెళ్లే మెట్ల మార్గాన్ని తొలగించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయనున్నారు. మూడు అంతస్తుల దర్శనం క్యూ కాంప్లెక్స్ రానుంది. రాజగోపురం నుంచి గుట్టపైకి ఉన్న మెట్ల మార్గంపై గాల్వనైజ్‌డ్ షీట్ పై కప్పు వేయనున్నారు. గుట్ట చుట్టూ గిరి ప్రదక్షిణ చేసేలా ఏర్పాట్లు చేయనున్నారు. డార్మెటరీలు, కాటేజీలు నిర్మిస్తారు.

పార్కింగ్ స్థలాలు, పోలీస్ ఔట్‌పోస్టును ఏర్పాటు చేయనున్నారు. పారిశుధ్యంపై కూడా ప్రత్యేక దృష్టి సారించనున్నారు. తాత్కాలికంగా కాకుండా పారిశుధ్య సమస్యకు శాశ్వత పరిష్కారం చూపనున్నారు. గోశాల నిర్మాణం, ప్రధాన దారుల ప్రవేశం వద్ద భారీ ఆర్చీలు నిర్మించనున్నారు. కల్యాణకట్ట, ప్రసాదాల షెడ్లను ఆధునీకరించనున్నారు. మాస్టర్ ప్లాన్ కోసమే ప్రస్తుతం గుట్టపై నిర్మాణంలో ఉన్న పనులను నిలిపి వేయాలని సూచించారు.

పెరగనున్న దేవస్థాన పదోన్నతి..

మాస్టర్ ప్లాన్‌లో కేవలం దేవస్థాన భౌగోళిక అభివృద్ధితో పాటు స్థాయి పెంపు కూడా ఉండనుంది. ప్రస్తుతం సహాయ కమిషనర్ కేడర్‌లో కొనసాగుతున్న చెర్వుగట్టు మాస్టర్ ప్లాన్‌లో భాగంగా ముందు డిప్యూటీ కమిషనర్ కేడర్‌కు అప్‌గ్రేడ్ చేయనున్నట్లు తెలిసింది. ఇదే జరిగితే సిబ్బంది కూడా పెరగనున్నారు. దేవస్థాన పాలన వ్యవహారాల్లో కొన్ని నిర్ణయాలను డీసీ కేడర్‌లో తీసుకునే వెసులుబాటు ఉంటుంది. దీంతో సమయం ఆదా అవడంతో పాటు అభివృద్ధి పనులు వేగంగా జరిగే అవకాశముంటుందని ఎండోమెంట్ సిబ్బంది అభిప్రాయపడుతున్నారు.

ఉద్దేశం

చెర్వుగట్టు క్షేత్రాన్ని కూడా ఓ మాస్టర్ ప్లాన్‌తో అభివృద్ధి పర్చేందుకు శాఖ ఉన్నతాధికారులు సంకల్పించారు. ప్రస్తుతం ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్యను వచ్చే 30 సంవత్సరాల్లో క్షేత్రానికి వచ్చే భక్తుల సంఖ్యను అంచనా వేస్తూ ఆలయ అభివృద్ధి దిక్సూచీలా ఉపయోగపడే ప్రణాళికే మాస్టర్ ప్లాన్. ఉద్దేశం. చెర్వుగట్టు దేవస్థానాన్ని సుమారు రూ.100 కోట్ల అంచనా వ్యయంతో అభివృద్ధి చేసేందుకు గతంలో మాస్టర్ ప్లాన్ తయారు చేశారు. భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా ఆగమ, వాస్తు శాస్త్రం ప్రకారం ఈ నిర్మాణాలను చేపట్టేలా మాస్టర్ ప్లాన్‌లో పొం దుపర్చారు. కొద్దిపాటి మార్పులతో అదే మాస్టర్‌ప్లాన్‌ను అమలుచేస్తారా లేక మారుస్తారో చూడాలి.

నిర్వాసితులందరికీ పరిహారం



భూనిర్వాసితులకు పరిహారం చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ, జూలై 8(ఆంధ్రజ్యోతి): దేవరకొండ నియోజకవర్గంలోని ప్రాజెక్టుల కింద భూములు కోల్పోతున్న నిర్వాసితులకు పూర్తిస్థాయిలో పరిహారం, పునరావాసం కల్పిస్తామని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ తెలిపారు. పెండ్లిపాకల రిజర్వాయర్ కింద భూములు కోల్పోతున్న రత్యతండాకు చెందిన 30మంది భూ నిర్వాసితులకు మంగళవారం నల్లగొండ జిల్లా దేవరకొండ మార్కెట్‌యార్డులో రూ.4.24కోట్ల విలువైన భూపరిహారం చెక్కులను అందజేశారు. డిండి ఎత్తిపోతల, నక్కలగండి, పెండ్లి పాకల రిజర్వాయర్ల కింద భూములు కోల్పోతున్న నిర్వాసితులందరికీ పరిహారం, పునరావాసం కల్పిస్తామని ఆందోళన చెందవద్దన్నారు. ప్రాజెక్టులను పూర్తిచేసి అన్ని గ్రామాలకు సాగు నీరు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. సీఎం సహాయనిధి, షాదీ ముబారక్ చెక్కుల విషయంలో లబ్ధిదారుల నుంచి ఎవరైనా డబ్బులు అడిగితే ఉపేక్షించేదిలేదని ఎమ్మెల్యే బాలునాయక్ స్పష్టంచేశారు. సీఎం సహాయనిధి కింద మంజూరైన చెక్కులను అందజేశారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు సీఎం సహాయనిధి ఉపశమనం కల్పిస్తుందన్నారు. డబ్బులు అడిగితే లబ్ధిదారులు వెంటనే తనకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, భూసేకరణ స్పెషల్ కలెక్టర్ లీలా, పీఏసీఎస్ చైర్మన్ డాక్టర్ వేణుధర్‌రెడ్డి, పెండ్లిపాకల ప్రాజెక్టు ఈఈ కేతావత్ నెహ్రూనాయక్, డీఈ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

12 వరకు ఓపెన్ పరీక్షల ఫీజు గడువు

నల్లగొండ, జూలై 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఓపెన్ స్కూల్స్ సొసైటీ ఆధ్వర్యంలో 2025-26 సంవత్సరానికి నిర్వహించే ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షల ఫీజును ఈ నెల 12వ తేదీలోగా చెల్లించాలని ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల హెడ్‌మాస్టర్, కోఆర్డినేటర్ ఎండీ యూస్‌పోద్దీన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. చదువు మధ్యలో ఆపివేసిన విద్యార్థులు, గృహిణులు, ఉద్యోగులు, వ్యాపారస్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు టీసీ, ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రంతో హాజరు కావాలని ఇతర వివరాలకు సెల్: 7981098521 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలి

ఎంజీయూ ఉపకులపతి ఖాజా అల్తాఫ్ హుస్సేన్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంజీయూ ఉపకులపతి ఖాజా అల్తాఫ్ హుస్సేన్

నల్లగొండ,జూలై 8 (ఆంధ్రజ్యోతి):విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని ఎంజీయూ ఉపకులపతి ఆచార్య ఖాజా అల్తాఫ్ హుస్సేన్ అన్నారు. మంగళవారం ఎంజీయూ సైన్స్ కళాశాల ఆధ్వర్యంలో ఎమ్మెస్సీ విద్యార్థులకు పరిశోధన పత్రాలు అందజేశారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చివరి సెమిస్టర్‌లో విద్యార్థులు చేసిన పరిశోధనలు భవిష్యత్తులో ఉద్యోగ అవకాశాలు వస్తాయన్నారు. 21మంది విద్యార్థులకు పరిశోధన పత్రాలు అందజేశారు. 13మంది విద్యార్థులు చిత్ర రూపకంగా పరిశోధనల పోస్టర్ ప్రజంటేషన్ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సతీష్ కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ డా.ప్రేమ్‌సాగర్, డాక్టర్ తిరుమల, అన్నపూర్ణ, మాదురి, మద్దిలేటి, రూప పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకులు బీహార్ రౌడీల్లా ప్రవర్తిస్తున్నారు



సమావేశంలో మాట్లాడుతున్న పటేల్ రమేష్‌రెడ్డి

సూర్యాపేట అర్బన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో బీఆర్ఎస్ నాయకులు బీహార్ రౌడీల్లా ప్రవర్తిస్తున్నారని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి రూ.3లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చారని, యువతకు 60వేల ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించారన్నారు. పేదలకు సన్నబియ్యం, రైతు బోనస్, మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు సౌకర్యం, రైతు భరోసా కింద 9 రోజుల్లో రూ.9వేల కోట్లు జమ చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కిందన్నారు. బీఆర్ఎస్ నాయకులు జైళ్లకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో అవినీతి, ఫోన్‌ట్యాపింగ్ చేస్తూ దొరికిపోయారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే తగిన గుణపాఠం చెబుతామన్నారు. కేటీఆర్ భాష అనైతికంగా ఉందన్నారు. రాష్ట్రాన్ని లూటీ చేసి ఫాంహైస్‌లు నిర్మించుకున్న చరిత్ర బీఆర్ఎస్ నాయకులదన్నారు. సమావేశంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్, నాయకులు డాక్టర్ వూర రాంమూర్తియాదవ్, వెలుగు వెంకన్న, వెంకన్ననాయక్ పాల్గొన్నారు.

క్షేత్రపాలకుడికి నాగవల్లీ దళార్చనలు



అంజనేయస్వామికి హారతి నివేదిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి సన్నిధిలో కొలువుదీరిన క్షేత్రపాలకుడు అంజనేయస్వామికి మంగళవారం నాగవల్లీ దళార్చనలు, లక్ష్మీనరసింహుడికి నిత్య కల్యాణం, నిత్యార్చనలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. కొండపైన విష్ణుపుష్కరిణి వద్ద ఆంజనేయస్వామికి ఆలయంలో అర్చకులు వేద మంత్ర పఠనాలతో పంచామృతాభిషేకం చేసిన అర్చకులు తమలపాకులు, సింధూరం, వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. ఆంజనేయుడికి సహస్రనామ పఠనాలతో నాగవల్లీ దళార్చనలు నిర్వహించి హారతి ఇచ్చారు. ప్రధానాలయంలో స్వయంభువులను సుప్రభాత సేవలతో మేల్కొలిపి నిజాభిషేకం, నిత్యార్చనలు, ముఖమండపంలో సుదర్శన నారసింహ హోమం, నిత్య తిరుకల్యాణోత్సవ పర్వాలను పాంచారాత్రగమ శాస్త్రరీతిలో నిర్వహించారు. శివాలయంలో పర్వతవర్థిని రామలింగేశ్వరస్వామికి ముఖ మండపంలోని స్ఫటికమూర్తులకు నిత్య రుద్రహోవనం శైవాగమన పద్ధతిలో కొనసాగాయి. పాతగుట్ట ఆలయంలో అంజనేయస్వామిని పంచామృతాలతో అభిషేకించి ఆకుపూజ చేపట్టారు. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ.12,56, 207ల ఆదాయం సమకూరినట్లు ఈవో ఎస్. వెంకట్రావ్ తెలిపారు.

దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



నిరసన తెలుపుతున్న దేవాలయ ఉద్యోగులు

యాదగిరిగుట్ట, జూలై 8(ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా భద్రాచలం ఈవో రమాదేవి,దేవాదాయ, దేవస్థానం సిబ్బందిపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ దేవాలయాల జేఏసీ చైర్మన్ గజ్వేల్లి రమేష్‌బాబు డిమాండ్ చేశారు. యాదగిరిగుట్ట ఆలయ వైకుంఠ ద్వారం చెంత ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో నిరసన చేపట్టిన సందర్భంగా ఆయన మాట్లాడారు.

తక్షణమే ప్రభుత్వం ఆలయ భూములను రక్షించేందుకు ఆలయ ఉద్యోగులకు ప్రభుత్వం సహకారం అందించాలన్నారు. సీతారామచంద్రస్వామి ఆలయానికి సంబంధించిన పురుషోత్తపట్నంలో ఆలయ భూములు రక్షించేందుకు వెళ్లిన దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు గజ్వేల్లి రఘు, ప్రతాప నవీన్‌కుమార్‌శర్మ, పర్యవేక్షకులు ముద్దసాని నరేష్, నటరాజన్ సంఘం నాయకులు ఎరుకల దయానంద్, ఊడెపు సుధాకర్, అన్నపూర్ణ, రత్నదీప, దొమ్మాట సత్తయ్య, బూడిద ఉమేష్, వై. మల్లేష్, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీత్లా పండుగ



పెద్దతండలో సీత్లా భవానికి నైవేద్యం తీసుకెళ్తున్న గిరిజన మహిళలు

తుర్కపల్లి, జూలై 8(ఆంధ్రజ్యోతి): సీత్లా పండుగను యాదాద్రిభువనగిరి జిల్లా తుర్కపల్లి మండలంలోని పెద్దతండాలో మంగళవారం గిరిజనులు ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని గిరిజన యువతులు, మహిళలు, యువకులు సీత్లా భవానికి నైవేద్యం సమర్పించేందుకు డప్పు వాయిద్యాలతో నృత్యాలు చేస్తూ గ్రామ పొలిమేరకు తరలివెళ్లారు. సీత్లా భవానికి నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి ఏటా శ్రావణ మాసంలో వచ్చే పెద్ద పుష్యాల కార్తె మొదటి వారంలో ఈ పండుగను నిర్వహిస్తారు. వర్షాలు బాగా కురిసి పంటలు పండాలని, తండావాసులు ఆరోగ్యంగా ఉండాలని, పశు సంపద అభివృద్ధి చెం దాలను గిరిజనులు సీత్లా భవానికి మొ క్కుకున్నారు.



చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

బీబీనగర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని యాదాద్రి భువనగిరి జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి మాధవిలత అన్నారు. మంగళవారం యాదాద్రిభువనగిరి జిల్లా బీబీనగర్ మండలంలోని గూడూరు శివారులోని బిర్లా ఓపెన్ మైన్స్ ఇంటర్నేషనల్ పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సులో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ర్యాగింగ్ నిషేధ చట్టాలు, ఫోక్స్ చట్టం, విద్యాహక్కు చట్టం, మాదక ద్రవ్యాల నిషేధ చట్టాల ప్రాముఖ్యతను వివరించారు. సైబర్ నేరాలు, శిక్షలు, పర్యావరణ పరిరక్షణ చట్టం, న్యాయ సేవా అధికార సంస్థ చట్టం, న్యాయ సహాయం అందుకు కావాల్సిన అర్హతలను వివరించారు. జువైనల్ జస్టిస్ చట్టం, బాలల సంరక్షణ కోసం తమ సంస్థ అందిస్తున్న సేవలను బాల సంరక్షణ సమితి అధ్యక్షురాలు బండారు జయశ్రీ వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రామకృష్ణారెడ్డి, డైరెక్టర్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

నల్లగొండ ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా

డాక్టర్ జె. సత్యనారాయణ

- మూడు జిల్లాల ఆస్పత్రులకు కొత్త సూపరింటెండెట్లు

భువనగిరి టౌన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ ప్రభుత్వ వైద్య కళాశాల నూతన ప్రిన్సిపాల్‌గా సూర్యాపేట ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ జె. సత్యనారాయణ నిమితులయ్యారు. ఉమ్మడి జిల్లాలోని మూడు జిల్లా ఆసుపత్రులు, ప్రభుత్వ వైద్య కళాశాలలో పలు బదిలీలు, నియామకాలు చేపడుతూ రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖ సెక్రటరీ డాక్టర్ క్రిస్టియానా జెడ్ చుంగ్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. భువనగిరి జిల్లా ఆసుపత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా ఉన్న డాక్టర్ జె. వెంకటేశ్వర్లు జయశంకర్ భూపాలపల్లి ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పదోన్నతిపై వెళ్లారు. ఆయన స్థానంలో భువనగిరి జిల్లా ఆసుపత్రి అనిస్తీషియా హెచ్‌వోడీ డాక్టర్ పాండునాయక్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా బాధ్యతలు చేపట్టారు. సూర్యాపేట జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రి ప్రొఫెసర్ డాక్టర్ పి. శ్రవణ్‌కుమార్ బదిలీపై వస్తున్నారు. నల్లగొండ జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా వరంగల్ ఎంజీఎం ప్రొఫెసర్ డాక్టర్ సీహెచ్. మధుబాబు బదిలీపై వస్తున్నారు. సూర్యాపేట జిల్లా ఆసుపత్రి ప్రొఫెసర్ డాక్టర్ కె రాజ్యలక్ష్మీ వికారాబాద్ జిల్లా ఆసుపత్రికి, భువనగిరి జిల్లా ఆసుపత్రి ప్రొఫెసర్ డాక్టర్ పి. మాలతి కొడంగల్ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా, అదే ఆసుపత్రికి చెందిన ప్రొఫెసర్ డాక్టర్ వి రాజలింగం, జనగామ జిల్లా ఆసుపత్రి సూపరిండెంట్‌గా పదోన్నతి బదిలీపై వెళ్తున్నారు. భువనగిరి జిల్లా ఆసుపత్రి ఈఎన్‌టీ ప్రొఫెసర్ డాక్టర్ టి. శంకర్ ఖమ్మం ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా బదిలీ అయ్యారు.

చుక్కలు చూపిస్తున్న యూరియా

- బస్తా ధర అమాంతం రూ.500లు పెంచిన వ్యాపారులు
- గగ్గోలు పెడుతున్న రైతులు
- బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్న వైనం



వానాకాలం సీజన్ ప్రారంభం కాకముందే జిల్లాలో యూరియా కొరత ఏర్పడింది. ఎరువుల వ్యాపారస్తులు యూరియాను బ్లాక్‌మార్కెట్‌కు తరలించడంలో కృత్రిమ కొరతను సృష్టిస్తున్నట్లు రైతు సంఘాలు ఆరోపిస్తున్నాయి. జిల్లాలోని నేరేడుచర్ల, కోదాడ లాంటి ప్రాంతాల్లో వ్యాపారస్తులు యూరియాను అమ్మబోమంటూ అధికారిక ప్రకటన చేయడం చర్చనీయంశంగా మారింది. జిల్లాలోని హుజూర్‌నగర్, కోదాడ, సూర్యాపేట, తుంగతుర్తి డివిజన్‌ల పరిధిలో సుమారు 1200పైగా ఎరువుల దుకాణాలు ఉన్నాయి. వీటికి తోడు పల్లె ప్రాంతాల్లో విచ్చలవిడిగా ఫర్టిలైజర్ షాపులు ఏర్పాటు చేసి రైతులకు యూరియాను అధిక ధరలకు విక్రయిస్తున్నారు.
- (ఆంధ్రజ్యోతి,హుజూర్‌నగర్)

జిల్లాలో సహకార సంఘాల ద్వారా ప్రభుత్వం బస్తా యూరియాను 260 లకు రైతులకు అందిస్తుండగా ప్రస్తుతంమార్కెట్‌లో యూరియా కొరత పేరుతో బస్తా యూరియను రూ.500లకు అమ్ముతున్నట్లు రైతు సంఘాలు పేర్కొంటున్నారు. ప్రస్తుతం వానాకాలం ప్రారంభానికి ముందే యూరియాను కొనుగోలు చేసేందుకు రైతులు ముందుకు రావడంతో వ్యాపారస్తులు రైతుల జీవితాలతో చెలగామాడుతున్నారని అన్నదాతలు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో యూరియా 5,104 మెట్రిక్‌టన్నులు నిల్వ ఉన్నట్లు అధికారులు లెక్కలప్రకారం పేర్కొంటున్నారు. డీఏపి 1775 మెట్రిక్‌టన్నులు, పోటాషియం 350 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 8891మెట్రిల్ టన్నులు, సింగిల్ సూపర్ ఫాస్పేట్ 876 మెట్రిక్ టన్నులు ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

అందుబాటులో 5104 మెట్రిక్ టన్నుల యూరియా


జిల్లా వ్యాప్తంగా 5104 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉన్నాయని వ్యవసాయశాఖ అధికారులు పేర్కొంటున్న నేపథ్యంలో ఎరువులదుకాణాలలో రూ.260కు అమ్మాల్సిన బస్తా యూరియాను రూ.500లు ఇస్తేనే యూరియా సరఫరా చేస్తామని రైతులకు వ్యాపారస్తులు చెప్పడం ఆంతర్యం ఏమిటని రైతు సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. సహకార సంఘాలలో బస్తా యూరియా రూ.260కు అమ్ముతుండగా వ్యాపారస్తులు గతంలో రూ.350కు పైగా అమ్మకాలు చేశారు. కానీ ఈ ఖరీఫ్ సీజన్ వచ్చే సరికి యూరియా కొరత పేరుతో రూ.500లకు అమాంతం పెంచడం పట్ల సర్వత్రా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. నేరేడుచర్ల ప్రాంతంలో ఒక రైతు 50బస్తాల యూరియా కావాలని వెళ్లగా 10 బస్తాల కన్నా ఎక్కువ అమ్మడం లేదని చెప్పడంతో వ్యాపారస్తులకు రైతుకు మధ్య ఘర్షణ చోటు చేసుకున్నట్లు తెలుస్తుంది. ఈ నేపథ్యంలోనే కోదాడ పట్టణంలో వ్యాపారస్తులు సమావేశం ఏర్పాటు చేసుకుని యూరియా అమ్మబోమని తీర్మానం చేసుకోవడంసంచలనంగామారింది. దీంతో స్పందించిన జిల్లా వ్యవసాయ అధికారులు వ్యాపారస్తులతో మాట్లాడి యూరియాను సక్రమంగా అందించాలని, షాపులు బంద్ చేయడం లాంటివి చేయవద్దని,యూరియా కొరత రాకుండా అందించాలని అధికారులు కోరడం చకచక జరిగాయి.

యూరియా కొరత రాకుండా చర్యలు



యూరియా కొరత రాకుండా చర్యలు తీసుకుంటున్నాం. రైతులకు అవసరమైన యూరియాను ప్రభుత్వం నిర్దేశించిన రూ.260ల ధర ప్రకారం అమ్ముతున్నారు. బహిరంగ మార్కెట్‌లో కూడా ప్రభుత్వం నిర్ణయించిన ధర ప్రకారమే యూరియా అమ్మకాలు చేపట్టాలి. అధిక ధరలకు యూరియాను అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటాం.
- రవీందర్‌నాయక్ ఏడీఏ, హుజూర్‌నగర్

బస్తా యూరియా రూ.500లకు విక్రయించడం సరికాదు..



బస్తాయూరియాను రూ.500లకు అమ్మడం సరియైన విధానం కాదు. ప్రభుత్వం నిర్ణయించిన రేటు ప్రకారం యూరియాను అమ్మాలి. వ్యాపారస్తులు యూరియాను బ్లాక్ మార్కెట్‌కు తరలించి కొరత సృష్టిస్తున్నారు. దీనిపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలి.
- గుండు వెంకటేశ్వర్లు, రైతు హుజూర్‌నగర్

సిండికేట్‌గా మారి..

జిల్లాలోని ఎరువుల వ్యాపారులు సిండికేట్‌గా మారి యూరియాను బ్లాక్ మార్కెట్‌కు తరలించి రైతులకు అధిక ధరకు విక్రయిస్తున్నట్లు రైతులు, రైతు సంఘాలు విమర్శిస్తున్నారు. సాగర్ ఆయకట్టు ప్రాంతంలోని కోదాడ, హుజూర్‌నగర్ డివిజన్‌ల పరిధిలోని అనేక మండలాల్లో ఇప్పటికే రైతులు ఖరీఫ్ సాగుకు సంబంధించి నార్లు పోశారు. ఎడమకాల్వ పరిధిలోని ఆయా డివిజన్‌ల పరిధిలో 2లక్షల 70 వేల ఎకరాలు ఉండగా ప్రతి ఎకరానికి 2 బస్తాల చొప్పున యూరియాను రైతులు చల్లనున్నారు. ఖరీఫ్ ప్రారంభ దశలో ముందుగా డీఏపీతో పాటు నారుమడులకు సంబంధించి నాటు పెరిగేందుకు యూరియాను చల్లుతారు. ఇదే అదునుగా వ్యాపారస్తులు యూరియా ధరలు పెంచడం పట్ల రైతుల నుండి తీవ్ర నిరసన వ్యక్తమవుతుంది. ప్రభుత్వం వ్యాగన్ల ద్వారా యూరియాను సత్వరమే సరఫరా చేసి రైతులకు సరిపడా అందించాలని కోరుతున్నారు.

నేడు రేపు కృష్ణా జలాల సరఫరా బంద్

భువనగిరి టౌన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ సైనిక్‌పురి రిజర్వాయర్ పైపులైన్ మరమ్మతుల కారణంగా బుధ, గురువారాల్లో భువనగిరి పట్టణంలో కృష్ణాజలాల సరఫరా ఉండదని మునిసిపల్ కమిషనర్ జి.రామలింగం ఓ ప్రకటనలో తెలిపారు. మరమ్మతు పనులు పూర్తయిన అనంతరం కృష్ణాజలాల సరఫరాను పునరుద్ధరిస్తామని తెలిపారు. ఈ మేరకు వినియోగదారులు రెండు రోజుల పాటు నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు.

ఇందిరమ్మ ఇళ్లను వేగంగా నిర్మించాలి

చౌటుప్పల్ టౌన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): చౌటుప్పల్ మునిసిపాలిటీలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని మునిసిపల్ కమిషనర్ జి.వెంకట్రామ్‌రెడ్డి లబ్ధిదారులను కోరారు. మునిసిపాలిటీలోని 1, 2 వ వార్డుల్లో మంగళవారం కమిషనర్ పర్యటించి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల ప్రగతిని పరిశీలించారు. ఇళ్ల నిర్మాణాలను వార్డు ఆఫీసర్లు నిత్యం పర్యవేక్షించాలని, అబ్దిదారులకు ఎదురయ్యే ఇబ్బందులపై తగు సూచనలు చేయాలని కమీషనర్ ఆదేశించారు.

భవనాలను అందుబాటులోకి తేరూ..!



రాజాపేట మండలం రఘునాథపూర్‌లోని అసంపూర్తి కమ్యూనిటీ భవనం

రాజాపేట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ప్రజల అవసరాల కోసం నిర్మిస్తున్న కమ్యూనిటీ భవన నిర్మాణాలు అసంపూర్తి గానే మిగిలిపోతున్నాయి. రాజాపేట మండలం రఘునాథపూర్, కొండ్రెడిచెరువు, జాల, బొందుగుల, రాజాపేట గ్రామాల్లో కమ్యూనిటీ భవనాల నిర్మాణాన్ని గత ప్రభుత్వ హయాంలో ప్రారంభించారు. ఏళ్లు గడుస్తున్నా నేటికీ పూర్తి కాలేదు. నిధుల కొరతతో కొన్ని, నిధులుండి కొన్ని సకాలంలో పూర్తి చేయలేదు. మండలంలోని రఘునాథపూర్‌లో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి అప్పటి ఎమ్మెల్సీ సంజీవరెడ్డి రూ.5లక్షలు మంజూరు చేశారు. 2012 ఫిబ్రవరి 4వ తేదీన ఆయన శంకుస్థాపన చేశారు. కాగా పనులు చేపట్టి స్లాబ్ వరకు పూర్తయి నిధుల కొరతతో అసంపూర్తి గానే మిగిలిపోయింది. మండలంలోని మిగతా గ్రామాల్లో కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలది ఇదే పరిస్థితి. భవనాల నిర్మాణాలను పూర్తి చేయాలని, నిధులు మంజూరు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు మొర పెట్టుకున్నా పట్టించుకునేవారే కరువయ్యారు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకుని నిర్మాణాలను పూర్తి చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

మురికికాల్వలను శుభ్రం చేయరూ..!

గుండాల, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రధాన రహదారి మురికి కాల్వలను మూడు నెలలుగా శుభ్రం చేయకపోవడంతో చెత్తాచెదారం నిండి పోయింది. కాల్వలో నీరు నిలిచిపోవడంతో దుర్వాసన వస్తోంది. మురికి కాల్వల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు నిండిపోవడంతో మురుగు నీరు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. పారిశుధ్య పనుల నిర్వహణలో పంచాయతీ సిబ్బంది పనితీరుపై కొందరు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పారిశుధ్యంపై ప్రభుత్వం ఎన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహించినా కిందిస్థాయిలో కొన్ని చోట్ల అమలు కావడంలేదనే విమర్శ ఉంది. దోమలు పెరిగి వ్యాధుల బారిన పడుతున్నట్లు గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మురికాల్వలను తరచూ శుభ్రం చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.



చెత్తా చెదారంతో నిండిన మురికి కాల్వ

సీసీరోడ్డు అంచులకు మట్టిని పోయించరూ..!

యాదగిరిగుట్ట రూరల్, జూలై 8, (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట మునిసిపాలిటీ పరిధిలోని గాంధీనగర్ చౌరస్తా నుంచి యాదగిరిపల్లి చౌరస్తా వరకు రోడ్డు గుంతలమయంగా ఉండడంతో ఇటీవలే సీసీ రోడ్డు వేశారు. ఈ రోడ్డు భూమి లెవల్‌కు ఫీట్ వరకు ఎత్తు పెంచారు. రోడ్డుకు ఇరువైపులా మట్టి పోయకపోవడంతో ఆరోడ్డు ప్రయాణికులు, వాహనదారుల పాలిట ప్రమాదకరంగా మారింది. ఈ విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి స్థానికులు తీసుకు వెళ్లినా ఫలితం లేకుండాపోయింది. ఇప్పటికైనా రోడ్డుకు ఇరువైపులా మట్టిపోసి చదును చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సీసీరోడ్డు నిర్మాణం చేసి నెల రోజులు కావస్తున్నా రోడ్డుకు ఇరువైపులా మట్టి పోయడం లేదని మాజీ వార్డు సభ్యుడు కృష్ణగౌడ్ అన్నారు. వాహనాలు రోడ్డుకిందికి దిగి ప్రమాదాలకు గురవుతున్నారని, ఈ విషయం అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని తెలిపారు. ఇదిలా ఉండగా గాంధీనగర్ చౌరస్తానుంచి యాదగిరిపల్లి చౌరస్తా వరకు నిర్మించే సీసీరోడ్డు చివరకు పూర్తి కాలేదని ఏఈ కరుణాకర్ తెలిపారు. రోడ్డు పూర్తి అయిన వెంటనే రోడ్డుకు ఇరువైపులా మట్టి పోయిస్తామని తెలిపారు. అంతవరకు వాహనదారులు రోడ్డుకు ఇరువైపులా చూసుకుంటూ జాగ్రత్తగా వెళ్లాలని సూచించారు.



సీసీ రోడ్డు అంచులకు మట్టిపోయకపోవడంతో ఇలా..

'బస్టాండ్‌ను నిర్మించాలి'

వలిగొండ, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాల అసంపూర్తిగా ఉన్న రిక్వెస్ట్ బస్టాండ్‌ను నిర్మించాలని ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు మైసోళ్ల నరేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద 13 సంవత్సరాల క్రితం రిక్వెస్ట్ బస్టాండ్ మంజూరైందని, పూర్తిస్థాయి నిర్మాణంలో బస్టాండ్ చేయడంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు. బస్టాండ్ లేకపోవడంతో కళాశాలకు వచ్చే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు మనోజ్, సాయి, భరత్, వరుణ్, వినయ్ పాల్గొన్నారు.

అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు

సంస్థాన్ నారాయణపురం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతీ ఒక్కరికి అందుతాయని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జయశ్రీ తెలిపారు. మండల కేంద్రంలో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను మంగళవారం పరిశీలించారు. ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులతో ఆమె మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారమే ఇళ్ల నిర్మాణాలు చేసుకోవాలని ఆమె సూచించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మండలంలో పైలట్ ప్రాజెక్టు కింద కోతులాపురంలో చేపట్టిన 24 ఇళ్లు పనులు ప్రారంభమే గ్రౌండ్ లింగ దశలో ఉన్నాయని ఆమె తెలిపారు. ఒక ఇంటి నిర్మాణం పూర్తయింది అన్నారు. మండల వ్యాప్తంగా 450 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయితే 389 ఇళ్ల నిర్మాణ పనులు చేపట్టినట్లు ఆమె వివరించారు. ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసేందుకు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించినట్లు ఆమె పేర్కొన్నారు. నిరుపేద కుటుంబాలకు చెందిన మహిళలు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం సమ భావన సంఘాల ద్వారా లక్ష రూపాయల వరకు రుణ సదుపాయం అందిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఇండ్ల నిర్మాణంలో ఎలాంటి అవకతవకలు జరిగినా సహించేది లేదన్నారు. వన మహోత్సవాలు మండలంలోని ప్రతి ఇంటికీ మొక్కలను పంపిణీ చేయనున్నట్లు ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రమోద్ కుమార్, ఎంపీ ఓ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



సంస్థాన్ నారాయణపురంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ జయశ్రీ

యువతకు గీత వృత్తిపై శిక్షణ ఇవ్వాలి

గీత పనివారల సంఘాల రాష్ట్ర సమన్వయ కార్యదర్శి నాగభూషణం

మోత్కూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయిలో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేసి, యువతకు గీత వృత్తిపై అవగాహన కల్పించి, అధునాతన ఉత్పత్తులు పెంచేలా శిక్షణ ఇవ్వాలని గీత పనివారల సమన్వయ సంఘం రాష్ట్ర కార్యదర్శి బొమ్మగాని నాగభూషణం కోరారు. మంగళవారం మోత్కూరు కేఆర్ భవన్‌లో నిర్వహించిన గీత పనివారల సంఘం జిల్లా సమితి సమావేశంలో ఆయన మాట్లాడారు. గీత వృత్తిదారులకు ఇచ్చే వృద్ధాప్య పింఛన్ నెలకు రూ.5 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు చాపల అంజయ్య, జిల్లా కార్యదర్శి బొలగాని సత్యనారాయణ, సీపీఐ నాయకులు యానాల దామోదర్‌రెడ్డి, అన్నెపు వెంకట్, పబ్బు యాదయ్య, పందుల యాదగిరి, బాలగాని సత్యనారాయణ, ఎర్ర రమేష్, బత్తిని నరేష్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గీతపనివారల సంఘం రాష్ట్ర కార్యదర్శి నాగభూషణం

పెన్షన్‌ను వెంటనే మంజూరు చేయాలి

భువనగిరి గంజ్, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగులకు పెండింగ్‌లో ఉన్న పెన్షన్ వెంటనే మంజూరు చేయాలని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కే వెంకట్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం భువనగిరిలో రౌండ్ టేబుల్ సమావేశం సంఘం జిల్లా అధ్యక్షుడు సురుపంగ ప్రకాశ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 24.85 లక్షల మంది చేయూత పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్నారని, మంజూరు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందన్నారు. స్థానిక సంస్థల్లో దివ్యాంగులకు ప్రాతినిధ్యం కల్పిస్తూ అసెంబ్లీలో చట్టం చేయాలన్నారు. దివ్యాంగుల కార్పొరేషన్‌లో కేడర్ స్ట్రెంత్ ప్రకారం ఉద్యోగులను ప్రకటించి ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో కొండమడుగు నరసింహ, మాటూరి బాలరాజు, దాసరి పాండు, వంగురు లక్ష్మయ్య, సురుపంగ శివలింగం, బొలగాని జయరాములు, దయ్యాల నరసింహ, నాగరాజు, లక్ష్మీనారాయణ, కాసాని రవి, కొత్త లలిత, వంగురు లంజయ్య, కొండపురం మనోహర, బర్ల పార్వతి, పాల విజయ్‌కుమార్ పండాల శ్రీహరి, గిరికల లింగస్వామి, నాగు నరసింహ, సిలువేరు మహేష్, సుదగాని వెంకన్న, రాములు తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి

(ఆంధ్రజ్యోతి-న్యూస్‌నెట్‌వర్క్) : దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా ఈ నెల 9న జిల్లాలో నిర్వహించనున్న సమ్మెలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని సీపీఎం, సీపీఐ, ఇతర ప్రజా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఈమేరకు మంగళవారం భువనగిరి జిల్లా కేంద్రంలో వేర్వేరుగా సమావేశాలు నిర్వహించారు. పలువురు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ, సీఐటీయు, యూఎస్‌పీసీ నాయకులు ఏశాల అశోక్, దాసరి పాండు, ముక్కెర్ల యాదయ్య, దాసరి లక్ష్మయ్య, చింతల పెంటయ్య, చొప్పరి సత్తయ్య, మాయ కృష్ణ, నరసింహ, బిక్షపతి, కొమురయ్య, లక్ష్మీనరసింహారెడ్డి, సైదులు, సత్తయ్య, మహేష్, నర్సిరెడ్డి, బాలరాజు, కరుణాకర్, బాలయ్య, మల్లేషం, శంకర్, రమేష్, వెంకటేష్, శ్రీశైలం, దశరథ, శశికాంత్ పాల్గొన్నారు. మోత్కూరులో సీఐటీయూ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్క్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బొల్లు యాదగిరి నాయకులు సామ శ్రీనివాస్‌రెడ్డి, మెతుకు అంజయ్య, షేక్ శ్రీను, కూరెల్ల కృష్ణ, నర్సింహ పాల్గొన్నారు. ఆలేరులో సీపీఐ సమావేశంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు చెక్క వెంకటేశ్ మాట్లాడారు.

రామన్నపేటలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎండీ.ఇమ్రాన్ మాట్లాడారు సీపీఐ మండల కార్యదర్శి ఉట్కూరి నరసింహ, గొరిగె నరసింహ, బత్తుల సత్యం, శివరాత్రి సమ్మయ్య పాల్గొన్నారు. ఆత్మకూరు(ఎం)లో సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు ఉప్పల ముత్యాలు మాట్లాడారు. నాయకులు మారుపాక వెంకటేశం, జక్క దయాకర్‌రెడ్డి, కె.సత్తయ్య, బి.లాల్‌రెడ్డి, రాజమణి తదితరులు పాల్గొన్నారు. చౌటుప్పల్‌లో ఏఐటీయుసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ.ఇమ్రాన్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.గాలయ్య మాట్లాడారు.

యాదగిరిగుట్ట మండలంలోని పెద్దకందుకూర్ గ్రామంలోని ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్ కంపెనీ ఆవరణలో సీఐటీయు, టీఆర్ఎస్‌కెవి, ఐఎన్‌టియుసి, టిఎన్‌టియుసి, హెచ్ఎంఎస్ యూనియన్ల గేట్ మీటింగ్‌లో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ మాట్లాడారు. కార్యక్రమంలో సీఐటియు జిల్లా కార్యదర్శి కల్లూరి మల్లేశం, ఆయా సంఘాలకు చెందిన అధ్యక్ష కార్యదర్శులు బర్మ సత్తయ్య, రాజిరెడ్డి, రేగు బాలనర్సయ్య, సత్యనారాయణ, శ్రీనివాస్, చెక్క రమేష్, సుబ్బారు సత్యనారాయణ, నాయకులు పుప్పాల గణేష్, బాలరాజు, పెంటయ్య, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



భువనగిరిలో నిరసన తెలుపుతున్న యూపీఎస్‌పీసీ నాయకులు

ఎన్నికల హామీలను అమలు చేయాలి

రాజాపేట, గుండాల, జూలై8(ఆంధ్రజ్యోతి):ఎన్నికలలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం రాజాపేట మండల కేంద్రలోని తహసీలార్ కార్యాలయం ఎదుట కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ అనితకు వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఫకీరు రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ వరంగల్ సభలో రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, రైతులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు.రైతు భరోసా ఎకరానికి పంటకు 7500 రూపాయలు చెల్లించాలని, ఫసల్ భీమాను వర్తింపజేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మేకల రమేశ్, కాయితి బాల్‌రెడ్డి, దాచపల్లి రాజు, మెండు భగవాన్ రెడ్డి, శీలం పాపిరెడ్డి, గాండ్ల నర్సింగరావు పాల్గొన్నారు. గుండాల తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. తహసీల్దార్ హరికృష్ణకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు విజయ్‌భాస్కర్‌రెడ్డి, జిల్లా కోశాధికారి సోమ నర్సయ్య, ఉపాధ్యక్షుడు వెంపటి సురేశ్, చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి, నాయకులు నాగయ్య, మచ్చ వివాకర్ , నిమ్మల అవినాశ్ రెడ్డి, సురేశ్, జక్కుల రామచంద్రు, బాలయ్య పాల్గొన్నారు.



రాజాపేట: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

భూదాన్‌పోచంపల్లి, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అధికారులు సంసిద్ధంగా ఉండాలని భువనగిరి ఆర్డీవో, భువనగిరి నియోజకవర్గ ఎన్నికల అధికారి కృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం భూదాన్‌పోచంపల్లి పట్టణంలోని జడ్పీహెచ్ఎస్‌లో బూత్‌స్థాయి ఆఫీసర్లకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల నిర్వహణలో నియమావళిని పాటించాలన్నారు. మండలంలోని సమస్యాత్మక గ్రామాల్లో గట్టి బందోబస్తు నిర్వహించి ఎన్నికలు సజావుగా చేపట్టాలన్నారు. అందులో బీఎల్‌వోల పాత్ర కీలకమన్నారు. బీఎల్‌వోల శిక్షణా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం పాఠశాలలో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును ఆయన పరిశీలించారు. మండల పరిధిలోని 50 పోలింగ్ బూత్‌లోని బీఎల్‌వోలకు శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్లు పీ శ్రీనివాస్‌రెడ్డి, నాయబ్ తహసీల్దారు నాగేశ్వర్‌రావు, ఎంఆర్ఐ వెంకట్‌రెడ్డి, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

స్కామ్ నిరూపిస్తే రాజకీయ సన్యాసం: రాజిరెడ్డి

రామన్నపేట, జులై 08 (ఆంధ్రజ్యోతి) : లబ్దిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల స్కీమ్‌లో కాంగ్రెస్ నాయకులు చేతివాటం ప్రదర్శించారని నిరూపిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటానని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు గంగుల వెంకట్ రాజిరెడ్డి సవాల్ విసిరారు. మంగళవారం మండల కేంద్రంలోస్థానిక రహదారి బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే వేముల వీరేశం చేస్తున్న అభివృద్ధిని ఓర్వలేక బీఆర్ఎస్ నాయకులు విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో మండలంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారని అన్నారు. కార్యక్రమంలో జినుకుల ప్రభాకర్, బత్తుల కృష్ణ, గురజాల అంజిరెడ్డి, గోదాసు పృధ్వీరాజ్, వనం చంద్రశేఖర్, జల్లె వెంకటేశం పాల్గొన్నారు.

మత్స్య కార్మిక సొసైటీలకు ఉచితంగా చేప పిల్లలు అందించాలి

మోత్కూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మత్స్య కార్మిక సొసైటీలకు ప్రభుత్వం ఉచితంగా చేప పిల్లలు అందించాలని పాలడుగు మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు వెండి యాదగిరి డిమాండ్ చేశారు. మంగళవారం పాలడుగులో నిర్వహించిన మత్స్య కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టెండర్ల ద్వారా కాంట్రాక్టర్లను నియమించి సరఫరా చేసే చేప పిల్లలు నాణ్యతగా ఉండటం లేదని, ప్రభుత్వం నేరుగా సొసైటీలకు డబ్బులు ఇస్తే వారు నాణ్యమైన చేప పిల్లలు తెచ్చి చెరువులు, కుంటల్లో పోసి పెంచుకుంటారన్నారు. నాసిరకం చేపపిల్లలతో అటు ప్రభుత్వ ఖజానాకు ఖర్చు తప్పడంలేదని, ఇటు మత్స్యకార్మికులకు లబ్ధి చేకూరడం లేదని అన్నారు. సమావేశంలో నాయకులు పిట్టల చంద్రయ్య, బరిగెల సూర్యనారాయణ, పుల్లయ్య, వెండి రజినికాంత్, సత్తయ్య, సురేష్, లచ్చయ్య, నాగరాజు, మహేష్, బాను, రాము పాల్గొన్నారు.

వానాకాలంలోనూ మూసీపై రయ్ రయ్

(5వ పేజీ తరువాయి)

రూ.45కోట్ల వ్యయం అవుతుందని అంచనాలు రూపొందించారు. రోడ్లు భవనాలశాఖ నుంచి ప్రభుత్వం అదనపు గ్రాంట్‌గా ఈ నిధులను మంజూరుచేసింది. అయితే జూలూరు-పెద్దరావులపల్లి వద్ద బ్రిడ్జి నిర్మాణానికి మాత్రం నిధులు మంజూరు కాలేదు. జూలూరు వద్ద ఇప్పటికే బ్రిడ్జి పిల్లర్ల దశలోనే నిలిచి ఏళ్లు గడుస్తోంది. ఈ బ్రిడ్జికి సైతం నిధులు మంజూరు చేసి పూర్తిచేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

భీమలింగం దర్శనానికి అడుగులు

మూసీ నది మధ్యలో ఉన్న సంగెం భీమలింగాన్ని ప్రజలు దర్శించుకునేలా, ప్రకృతి అందాలతో అలరారే ఈ ప్రాంతాన్ని ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా మార్చాలని ప్రభుత్వం సంకల్పించింది. కార్తీక మాసంలో భక్తులు ఇక్కడి భీమలింగాన్ని దర్శించుకుంటుంటారు. చుట్టుపక్కల నుంచి వచ్చే మూడు వాగుల నీరు భీమలింగ వద్ద కలుస్తుండటంతో ఇది త్రివేణి సంగమంగా పేరు గాంచింది. కాలక్రమంలో సంగెంగా ఈ ప్రాతం పేరు మారింది. కాకతీయుల కాలంలో ఇక్కడ లింగాన్ని ప్రతిష్ఠించగా, మూసీ పరివాహక ప్రాంతంలోని ప్రజలకు ఏ కష్టమొచ్చినా శివుడిపై భారం వేసి భీమలింగాన్ని దర్శించుకుని పూజలు చేస్తుంటారు. భీమలింగం సరిగ్గా మూసీ వాగు మధ్యలో ఉంది. భారీ వర్షాలు కురిసి, నది ఉధృతంగా ప్రవహించినా ఇక్కడి శివలింగం మునిగిపోదు. నదిలో ఉన్న ఈ లింగాన్ని దర్శించుకునేందుకు సుదూర ప్రాంతం నుంచి భక్తులు వస్తుంటారు. ఇక్కడి లోలెవల్ బ్రిడ్జిపై నుంచే దర్శనం చేసుకుని, మొక్కు చెల్లించుకుంటారు. లింగం వద్ద వెళ్లాలంటే నదీ ప్రవాహంలో రాళ్లకు పట్టిన పాకురుతో అడుగులు జారి కొట్టుకుపోయే ప్రమాదం ఉంది. దీంతో అక్కడికి వెళ్లేందుకు ఎవ్వరూ సాహసం చేయరు. మూసీ పర్యటన సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి భీమలింగాన్ని దర్శించుకొని, స్వామివారిని ప్రజలు సౌకర్యంగా దర్శించుకునేలా రూ.2కోట్లతో ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు. ఆ మేరకు ఈ ప్రాంతాన్ని ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా మార్చేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఆర్కిటెక్చర్ మూసీ పరిసర ప్రాంతాలను పరిశీలించి, ఇరిగేషన్ అధికారులతో చర్చించి పూర్తి స్థాయి ప్రతిపాదనలు రూపొందించారు. భీమలింగం వరకు చేరుకునేందుకు శాశ్వత రోడ్డుతో పాటు భక్తులు వాహనాలు నిలిపేందుకు స్థలాన్ని ఎంపిక చేయనున్నారు. స్వయంభు లింగాన్ని కదిలించకుండా శివాలయాన్ని నిర్మించనున్నారు. లింగం చుట్టూ భక్తులు ప్రదక్షిణ చేసేలా ఏర్పాట్లు చేయనున్నారు.

గుంతల రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి: సీపీఎం

రామన్నపేట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): రామన్నపేట మండల వ్యాప్తంగా అస్తవ్యస్తంగా మారి నరక కూపాలుగా మారుతున్న రోడ్లకు వెంటనే మరమ్మతులు చేయాలని, అన్ని గ్రామాలకు ఆర్టీసీ బస్సులను పునరుద్ధరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జల్లెల పెంటయ్య డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో సీపీఎం కార్యాలయంలో కూరెళ్ల నరసింహాచారి అధ్యక్షతన జరిగిన పార్టీ సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, మండల కార్యదర్శి వర్గ సభ్యులు బల్గూరి అంజయ్య, బోయిని అనంద్, కల్లూరి నగేష్ పాల్గొన్నారు.

ఏకాగ్రతతో లక్ష్యాన్ని సాధించాలి

భువనగిరి రూరల్, జూలై 8(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పట్టుదలతో ఏకాగ్రతతో విద్యనభ్యసించి ఎంచుకున్న లక్ష్యాన్ని అధిగమించాలని చావా ఫౌండేషన్, ఆర్కే హాస్పిటల్ అధినేత డాక్టర్ రాజ్‌కుమార్ సహకారంతో మండలంలోని అనంతారం శివారులో గల జ్యోతి బాపూలే రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల విద్యార్థులకు మంగళవారం ప్రింటర్, ప్లాస్టిక్ కుర్చీలను బహూకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు దాతలు బహూకరించిన సౌకర్యాలు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ అశ్లేష, కళాశాల వైస్ ప్రిన్సిపల్ నరేశ్, అధ్యాపకులు కవిత, స్వాతి, మహేశ్వర్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

జాతీయ కుటుంబ ప్రయోజన పథకాన్ని అమలు చేయాలి

మోత్కూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): జాతీయ కుటుంబ ప్రయోజన పథకాన్ని (ఎన్ఎఫ్‌బీఎస్) పథకాన్ని వెంటనే రాష్ట్రంలో అమలు చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు గుదే మధుసూదన్ కోరారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ పథకాన్ని 2017లో కేంద్ర ప్రభుత్వం ప్రారంభినప్పటికీ రాష్ట్రంలో అమలుకు నోచుకోవడం లేదన్నారు. దారిద్ర్య రేఖకు దిగువ ఉన్న (పేద) కుటుంబ పెద్ద మృతి చెందితే ఈ పథకంలో కేంద్ర ప్రభుత్వం రూ.20 వేలు ఆర్థిక సహాయం అందిస్తుందన్నారు. ఈ ఎమౌంటును రూ.50 వేలకు పెంచాలని ఆయన కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ, రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వెంటనే రాష్ట్రంలో ఈ పథకాన్ని అమలు చేయాలన్నారు. నాయకులు అండెం సుధాకర్‌రెడ్డి, చింతల నర్సిరెడ్డి, పైళ్ల సతీష్ ఆయన వెంట ఉన్నారు.

విద్యార్థులను ఇంటి వద్ద చదివించాలి: ఎంఈవో

మోత్కూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులను తల్లిదండ్రులు ఇంటి వద్ద చదివించాలని, వారి నడవడికను కూడా గమనించాలని ఎంఈవో తీపిరెడ్డి గోపాల్‌రెడ్డి కోరారు. మంగళవారం మోత్కూరు జడ్పీహెచ్ఎస్‌లో నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు పాఠశాలలో గడిపే సమయం కంటే ఇంటివద్ద గడిపే సమయమే ఎక్కువ అని, విద్యార్థుల తల్లిదండ్రులు వారు ఏం చేస్తున్నారో గమనించాలని, వారి చేత హోం వర్కు చేయించాలని, పాఠాలు చదివించాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి హెచ్ఎం డి.అరవిందరాయుడు పాల్గొన్నారు.


గోరింటాకు సంబరాలు

రాజాపేట,జూలై8(ఆంధ్రజ్యోతి): రాజాపేట మండల కేంద్రం లోని అంగన్‌వాడి-1 కేంద్రంలో మంగళవారం గోరింటాకు సంబరాలను నిర్వహించారు. చిన్నారులకు గోరింటాకును పెట్టి సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడి టీచర్ భాగ్యలక్ష్మి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రామన్నపేట వాసికి స్వర్ణ పతకం

రామన్నపేట, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని బీసీ కాలనీకి చెందిన కళ్యాం ధనోజ సోమవారం వరంగల్‌లోని కాకతీయ విశ్వ విద్యాలయం ఆడిటోరియంలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, యూనివర్సిటీ చాన్సలర్, వైస్ చాన్సలర్‌ల నుంచి స్వర్ణ పతకం అందుకున్నారు. 2021వ బ్యాచ్‌కు చెందిన కళ్యాం ధనోజకు 23వ స్నాతకోత్సవం సందర్భంగా గోల్డ్ మెడల్‌ను అందజేసినట్లు మంగళవారం ఆమె ఒక ప్రకటనలో తెలిపారు.

వైఎస్ఆర్ ఆశయాలు కొనసాగించాలి



భువనగిరిలో వైఎస్ఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆంధ్రజ్యోతి-న్యూస్‌నెట్‌వర్క్ : నిరుపేదలకు, రైతులకు అండగా ఉంటూ ఎన్నో సంక్షేమ పథకాలు అందించిన మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి ఆశయాలను కొనసాగించాలని పీసీసీ సభ్యుడు తంగళ్లపల్లి రవికుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం భువనగిరి జిల్లా కేంద్రంలో మాజీ సీఎం వైఎస్ఆర్ జయంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానికి కాంగ్రెస్, యూత్, ఎన్ఎస్‌యుఐ నాయకులు వేరువేరుగా పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ అవేసి చిస్తీ, పట్టణ అధ్యక్షుడు కూర వెంకటేష్, బర్రె జహంగీర్, పిట్టల బాలరాజు, సలావుద్దీన్, వెంకటేశ్వర్లు, నరసింహ, తాడూరి నరసింహ పాల్గొన్నారు.

భూదాన్‌పోచంపల్లి, యాదగిరిగుట్ట, మోత్కూరు, రామన్నపేట, ఆత్మకూరు(ఎం), తుర్కపల్లి, వలిగొండ, రాజాపేట, బీబీనగర్ మండల కేంద్రాల్లో వైఎస్ఆర్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

'సీఎం బహిరంగ సభను విజయవంతం చేయాలి'

మోత్కూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): తిరుమలగిరిలో ఈ నెల 14న సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్న నూతన రేషన్‌కార్డుల పంపిణీ బహిరంగ సభకు ప్రజలు అధిక సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ జిల్లా నాయకుడు డాక్టర్ గుర్రం లక్ష్మీనర్సింహారెడ్డి, పట్టణ అధ్యక్షుడు గుండగోని రామచంద్రు కోరారు. మంగళవారం మోత్కూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం గత పదేళ్లలో ఒక్క రేషన్‌కార్డు ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అర్హులైన వారందరికీ కొత్త రేషన్‌కార్డులు ఇస్తుందన్నారు. ప్రజలు స్వచ్ఛందగా తరలి వచ్చి సభను విజయవంతం చేయాలన్నారు. నాయకులు బద్దం నాగార్జునరెడ్డి, చింతల విజయభాస్కర్ రెడ్డి, బొల్లెపల్లి వెంకటయ్య, పోలేనేని స్వామిరాయుడు, మందుల సురేష్ ఉన్నారు.